
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 2 ఏప్రిల్ 2024






పన్ను బాదుడు

- పుర పౌరులపై ఆస్తి పన్ను భారం
- వరుసగా నాల్గవసారి పెరగనున్న వైనం
- పెరిగిన పన్ను అమలులోకి..
- మూడు జిల్లాల్లో ఆస్తి పన్ను భారం రూ.50 కోట్లు పైమాటే
- పన్ను చెల్లింపు దారుల నుంచి తీవ్ర వ్యతిరేకత





తాను అధికారంలోకి వస్తే అన్నీ పెంచుకుంటూ పోతానని ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ అన్నారు. ఏ సంక్షేమ పథకాలో.. అభివృద్ధి పనులో అని ప్రజలు భావించారు. తీరా చూస్తే బస్సు.. కరెంటు ఛార్జీలను ఐదేళ్ల పాటు పెంచుకుంటూ పోయారు. ఆస్తి పన్ను, భూముల విలువ పెంచేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చెత్తపన్ను వసూలు చేశారు. ఆఖరికి ఖాళీ స్థలాల పైనా పన్ను వేసి జనాల నడ్డి విరగ్గొట్టారు. పెంచుకుంటూ పోతానంటూ ఆయన ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన మాటల్లో ఇంత అర్థం దాగి ఉందా అని పట్టణ వాసులు వాపోతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం పుర పౌరులపై మరోసారి ఆర్థిక భారం మోపింది. పన్ను పెరుగుదలకు హద్దే లేకుండా పోయింది. ఉన్న పన్నును 15శాతం పెంచేసింది. వరుసగా నాల్గవ ఏడాది పెంచింది. పెంచిన ఆస్తి పన్ను సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వం బాదుడే బాదుడు అన్న నినాదాన్ని అమలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చెత్త పన్నుకు తోడు ఆస్తి పన్ను పెంపుదలపై పట్టణ వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వీరి మొర ఆలకించే పాలకులే కరువయ్యారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పుర పౌరులపై దాదాపు రూ.50 కోట్ల ఆస్తి పన్ను భారం పడింది.

ఆస్తి పన్ను విషయంలో ప్రభుత్వ తీరు తగ్గేదేలే అన్న రీతిన జగన్ సర్కార్ వ్యవహరిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మునిసిపాల్టీలలో ఉన్న పన్ను విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఆస్తి మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా పన్నును విధిస్తోంది. దీని ప్రకారం ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేశారు. దీని ఆధారంగా ఆస్తి పన్ను ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అద్దె విలువ, మునిసిపాల్టీలో జోన్‌ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణనలోకి తీసుకునే వారు. మునిసిపాల్టీ గెజిట్ ప్రకారం జోన్‌ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనంకు మాత్రమే పన్ను విధించే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతో పాటు, ఒక వేళ భవనం చుట్టు ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధిస్తున్నారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ప్రజల జేబును ఎన్ని విధాలుగా ఖాళీ చేయ వచ్చో మునిసిపాల్టీలలో నూతన ఆస్తి పన్ను విధానం తెలియజేస్తోంది.

- ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటా పెరుగుతోంది. క్యాపిటల్ వాల్యూ ప్రకారం పన్ను నిర్ణయించిన సమయంలో గతంలో చెల్లిస్తు న్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారిస్తారు. తేడా ఉన్న పన్ను ఏటా 15శాతం పన్ను పెరుగుతోంది. మార్కెట్ విలువకు సమానం అయ్యేవరకు పన్ను ఆ మాదిరిగా పెరుగుతూనే ఉంటుంది. రూ.100 ఉన్న పన్ను రూ.115కు పెరగనుంది.

ఈ పన్నుల బాదుడు మునిసిపాల్టీలో ఆరంభమే కాని అంతం కాదని చెప్పవచ్చు. ఉదా హరణకు నరసరావుపేట మునిసిపా ల్టీలో పన్ను డిమాండ్ సుమారు రూ.8.59 కోట్లు దీని ప్రకారం 15శాతం పన్ను పెరగడంతో ఈ ముని సిపాల్టీ ఆదాయం దాదాపు మరో రూ.1.28 కోట్లు వరకు పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని అన్ని పురపాలక సంఘాలు, గుంటూరు కార్పొరేషన్‌లో రూ.35 కోట్లకు పైగా ఆస్తి పన్ను భారం ప్రజలపై భారం పడనున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. పన్నులు తగ్గించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోక పోతుండటంతో ప్రభుత్వంపై పన్ను దారులు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు.



- ఓ వ్యక్తి తన ఇంటికి ఏటా రూ.690 పన్ను చెల్లించే వాడు.. దీనికి ఏటా ప్రభుత్వం 15 శాతం చొప్పున పెంచేస్తోంది. వరుసగా నాల్గవ ఏడాది అస్తి పన్ను పెరుగుతోంది. ఇలా పెంచిన పన్నుతో రూ.690 పన్ను కాస్తా రూ.1210కి పెరిగింది. అంటే నాలుగేళ్లలో రూ.520 పన్ను పెరిగింది. పన్ను పెంపుదలతో పాటు చెత్త పన్ను భారం కూడా జనాలపై వేస్తున్నారు. ఒక్కో ఇంటికి నెలకు 60 చొప్పున సంవత్సరానికి రూ.720 చెత్తకు పన్ను వసూలు చేస్తున్న ఘనత జగనన్న సర్కార్‌కే దక్కడటం విశేషం. మధ్య తరగతి వర్గాలపై ప్రభుత్వం పన్నుల రూపంలో మోయలేని ఆర్థిక భారాన్ని మోపడంలో జగనన్న రికార్డు సృష్టించాడని చెప్పవచ్చు.

ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు..



చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడలేకే మేము ఆందోళన చేపట్టాం. వేతనాలు పెరగడం మాటేమోగాని వచ్చే వేతనం కూడా ఆగిపోయింది. సమ్మెకాలానికి సంబంధించి 42 రోజుల జీతం ఆగిపోవడంతో మేమేం చేయాలి. మా కష్టాలు మరింత పెరిగాయి. ఆర్థికంగా చితికిపోతున్నాం.

- రేఖ, బాపట్ల జిల్లా కార్యదర్శి

- తిరిగి విధుల్లో చేరి రెండు నెలలైనా అందని జీతాలు

సమ్మె కాలానికి

వేతనమేది?

- సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన ఉద్యోగులు
- నలభై రోజులకు పైగా సాగిన ఉద్యోగుల పోరాటం
- బెదిరించి, భయపెట్టి ఆందోళనను అడ్డుకున్న ప్రభుత్వం
- తొలగింపు ఆదేశాలతో ఉద్యమంపై ఉక్కుపాదం
- జీతాలు కూడా రాకపోవడంతో నిరాశలో ఉద్యోగులు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మూడు నెలల క్రితం తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్వాడీ ఉద్యోగులకు సమస్యల పరిష్కారం మాటెలా వున్నా వేతనాలు కూడా దక్కని పరిస్థితి వచ్చి పడింది. సమ్మె విరమించి ఇప్పటికి రెండునెలలు పూర్తయినా సమ్మెకాలానికి సంబంధించి వారికి రావాల్సిన వేతనాలు ఈరోజు వరకూ వారికి దక్కలేదు. ఇదుగో.. అదిగో అంటూ రెండు నెలలుగా నెట్టుకొచ్చిన ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వలేక పోయింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వారికి వేతనాలు వస్తాయా? రావా? అన్న ఆందోళనలో ఉద్యోగులు అల్లాడిపోతున్నారు.

సమస్యల మాటేమోగానీ..

అంగన్వాడీ కేంద్రాలను ఏళ్లకేళ్లుగా వేధిస్తున్న సమస్యల పరిష్కారం కోసం, కనీస వేతనాల కోసం అంగన్వాడీ ఉద్యోగులు కిందటేడాది డిసెంబరు 8న సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో దాన్ని డిసెంబరు 12 వరకూ వాయిదా వేసుకున్నారు. చర్చల్లో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో విధిలేని పరిస్థితిలో డిసెంబరు 12న సమ్మెకు దిగారు. ఆరోజు నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకూ ప్రభుత్వం, అధికారులు ఎన్ని రకాలుగా భయపెట్టినా, బెదిరించినా, ఎస్మా ప్రయోగించినా వెరువక 42రోజులపాటు సమ్మె చేశారు. ఉద్యమ క్రమంలో చర్చల పేరుతో ఉద్యోగులను పిలిచినా ఒక్క సమస్యపై కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో ఉద్యమం అంత కంతకూ పెరిగిపోయింది. ఉద్యోగులు ఎంతకీ లొంగి రాకపోవడంతో ప్రభుత్వం ఉద్యోగుల తొలగింపుకు ఆదేశాలు జారీ చేసింది. వాటిని కూడా ఉద్యోగులు లెక్క చేయక తమ ఆందోళనను కొనసాగించారు. ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు ఇళ్లకే పంపించారు. దీంతో ఉద్యోగులు అర్థంతరంగా తమ ఆందోళనను విరమించాల్సి వచ్చింది. ఆ తరువాత ప్రభుత్వం మరోమారు చర్చలకని పిలిచినా 2024 జూన్‌లో ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరుపుతామని చెప్పింది. సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్న హామీ లభించడం మినహా ఉద్యోగులకు ఏ ఒక్క హామీ కూడా దక్కలేదు. కానీ ఇప్పుడు ఆ హామీ కూడా అమలుకు నోచుకోలేదు.

రెండు నెలలుగా సాచివేత

అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె విరమించి ఇప్పటికి రెండు నెలలు దాటిపోయింది. ఈ ఏడాది జనవరి 23న వారు సమ్మె విరమించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ వారికి సమ్మెకాలం 42 రోజులకు సంబంధించిన వేతనం మాత్రం దక్కలేదు. వేతనం మీదే ఆధారపడే చిరుద్యోగులు కావడంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం 14,500 కంటే మూడు వేలు తక్కువ జీతం, నెలకు 11,500తో సరి పుచ్చుకుంటున్న వారికి 42 రోజుల జీతం ఆగిపోవడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులయింది. జీతాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం మాత్రం దక్కలేదు. ఇదిలా కొనసాగుతుండగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో వారికి జీతాలు ఎప్పుడు అందుతాయనేది సమాధానం లేని ప్రశ్నగా మారింది.

రెండు నెలలైనా జీతాలు రాలేదు:

సమ్మె విరమణ చేసి రెండు నెలలైనా ఇప్పటి వరకూ జీతాలు పడలేదు. ప్రభుత్వం ఎంతో నమ్మకంగా సమ్మెకాలానికి జీతాలు ఇస్తామని చెప్పింది. అవేవీ ఇవ్వకుండానే రెండు నెలలు కాలం గడిపేసింది. ఇది కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని మాకు అనుమానం కలుగుతోంది.



దీప్తి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల కోడ్ వచ్చాక జీతాలు పడతాయా?:

ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూడా అమలులోకి వచ్చింది. ఇక జీతాలు వస్తాయా అనేది అనుమానమే! ప్రభుత్వం ముందుగానే అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె కాలపు జీతాలు ఇవ్వాలి. కావాలనే ఎన్నికల కోడ్ వరకూ తాత్సారం చేసింది.



మెటిల్డా, పల్నాడు జిల్లా అధ్యక్షురాలు

ఆమంచిపై వేటు?



- నేడో రేపో అధిష్ఠానం నిర్ణయం
- వికటించిన టీడీపీలో చేరిక అంశం
- ఇండిపెండెంట్ అంటూ తాజాగా తెరపైకి

చీరాల, ఏప్రిల్ 1: వైసీపీ నేత, చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నేడో, రేపో నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితం టీడీపీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలు వికటించాయనే ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో పార్టీకి నష్టం కలిగిస్తూ తన వ్యక్తిగత ప్రయోజనాలను ఆశిస్తూ, సొంత అజెండాతో ప్రయాణం చేయడం అందుకు కారణమని వైసీపీ శ్రేణులు భావిస్తున్నట్లు తెలిసింది. వైసీపీ అధిష్ఠానం చేపట్టిన మార్పులు, చేర్పుల విషయంలో ఆమంచిని పర్చూరు ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించి, యడం బాలాజీని నియమించారు. చీరాల అభ్యర్థిగా కరణం వెంకటేశ్ పేరును ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆమంచి తన సన్నిహితులు, శ్రేయోభిలాషులతో దాదాపు ప్రతి రోజు మంతనాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆమంచి టీడీపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కొద్దిరోజుల ప్రచారం జరిగింది. తర్వాత కొద్దిరోజులు ఆయన సూచించిన వ్యక్తికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా టిక్కెట్ ఇస్తారని ఆమంచి అనుచరులు ప్రచారం చేశారు. కాగా టీడీపీ చీరాల ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎంఎం కొండయ్య పేరును కూటమి అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఆమంచి అనుచరులు అప్పటి వరకు ఊహించుకున్న చిత్రం మారింది. ఈక్రమంలో చీరాల వైసీపీ టిక్కెట్ ఆమంచికి ఇవ్వాలంటూ ఆయన అనుయాయులు అక్కడక్కడ సమావేశాలు నిర్వహించారు. జరిగిన, జరుగుతున్న పరిణామాలపై వైసీపీ అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో ఆమంచిని నేడో, రేపో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారనే మాటలు ఆపార్టీ శ్రేణుల అంతరంగిక సమావేశాల్లో బలంగా వినిపిస్తున్నాయి.

పాత ఫార్ములా ప్రయోగిద్దాం

2014 ఎన్నికల్లో ఆమంచి ఇండిపెండెంట్‌గా(నవోదయం పార్టీ) గెలుపొందారు. తాజా ఎన్నికల్లో కూడా ఆ పాత ఫార్ములాను తిరిగి ప్రయోగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే 2014 పరిస్థితులకు, 2024 పరిస్థితులకు పొంతన లేదని ఆమంచి అనుచరుల్లోనే పలువురు పెదవి విరుస్తున్నారు. దీంతో అడుగులు ఎలా వేద్దామని విషయమై ఆమంచి అనుచరుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(మంగళవారం)
సహారీ (ఉదయం) 4.45 (బుధవారం)

తమ్ముళ్లలో..

సమరోత్సాహం

- చంద్రబాబు ప్రజాగళం సభ సక్సెస్
- మాజీ ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ
- నేతలతో బస్సులో సమావేశమై దిశానిర్దేశం
- అధినేతకు వీడ్కోలు పలికిన టీడీపీ శ్రేణులు



బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల పర్యటన విజయవంతమైంది. సమస్యలను ఎత్తి చూపడంతో పాటు వాటి పరిష్కారం విషయంలో స్పష్టమైన హామీని ఇవ్వడంతో పాటు బాపట్ల ప్రజలకు నేనున్నా అనే సంకేతాన్ని గట్టిగా వినిపించారు. ప్రజాగళం సభ సక్సెస్ అవడం ద్వారా టీడీపీ శ్రేణులు సమరోత్సాహంతో ఉన్నాయి. ఆదివారం రాత్రి ప్రజాగళం సభ ముగిసిన అనంతరం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస చేసిన చంద్రబాబు సోమవారం ఉదయం నేతలతో సమీక్షించారు. ఈ క్రమంలో చంద్రబాబు సమక్షంలో బాపట్ల నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. కాకినాడ జిల్లా జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ జన్నపు రెడ్డి సుబ్బారావు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. పలు సమస్యలపై వినతులు అందించడానికి చంద్రబాబు బస చేసిన బస్సు వద్ద పలువురు క్యూ కట్టారు. అందరి సమస్యలను విన్న టీడీపీ అధినేత అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం 11 గంటల సమయంలో హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు చంద్రబాబు తిరుగు పయనమయ్యారు. ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టి పాటి రవికుమార్, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మలతో పాటు పెద్దసంఖ్య లో వచ్చిన పార్టీ శ్రేణులు చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు.

విధ్వంసాన్ని వివరించాలి..

బాపట్ల లోక్‌సభ పరిధిలోని నియోజకవర్గాల అభ్యర్థులతో టీడీపీ అధినేత చంద్రబాబు రెండు పర్యాయలుగా సమావేశమయ్యారు. తొలుత ఆదివారం రాత్రి నాయకులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఉదయం నేతలతో సమావేశమై ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇదే సమయంలో గెలుపుపై అతి విశ్వాసం వద్దన్నారు. గ్రామ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సేవలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని నేతలకు సూచించారు. బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గతంలో ఎన్నో ప్రాజెక్టుల్లో తనదైన ముద్ర వేశారని, ఆయన ఐపీఎస్‌గా అందించిన సేవలను కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పదవులు మొదలుకుని అన్ని విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ఓరుగంటి రెడ్లు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఓరుగంటి రెడ్ల సంక్షేమం కోసం టీడీపీ కట్టుబడి ఉందని తెలపడంతో పాటు వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను అధికారంలోకి రాగానే ఏర్పాటు చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చా రు. ఈ నేపథ్యంలో ఓరుగంటి రెడ్డి సం ఘం నాయకులు సోమవారం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ భద్రత లేక బాధలు పడుతున్నామని, కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని బాపట్ల జిల్లా విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చంద్రబాబుకు వినతి పత్రం అందించారు. అధికారంలోకి రాగానే తమను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని వారు అందులో పేర్కొన్నారు.

విదేశీ విద్యను దూరం చేశారు..

విదేశీ విద్యకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక బాధితులుగా మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం చంద్రబాబును కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చిన బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో విదేశీ విద్యాధారణ, అంబేద్కర్ విదేశీ విద్య పేరిట స్కాలర్‌షిప్‌లు అందించి పేదలకు ఎంతో అండగా నిలిచారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం 26 జిల్లాల్లోని 359 మంది పేద విద్యార్థులకు విదేశీవిద్యసాయం అందక అల్లాడిపోతున్నారని వివరించారు. అధి కారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

అద్దంకిపై.. బెట్టింగ్‌లు



- టీడీపీ మెజార్టీపై కాయ్ రాజా కాయ్
- ఇతర జిల్లాల నుంచి వచ్చి మరీ పందాలు


అద్దంకి/బల్లికురవ, ఏప్రిల్ 1: ఎన్నికలతో బెట్టింగ్ రాయుళ్ల పండుగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం అద్దంకి నియోజకవర్గంలో మెజార్టీపై జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో గొట్టిపాటి రవికుమార్ వరుసగా మూడుసార్లు మూడు పార్టీల నుంచి విజయం సాధించడంతో ఈదఫా కూడా అదే పంథాలో గెలుపొందుతారన్న ధీమా అత్యధిక శాతం ఓటర్లలో నెలకొంది. ఈ నేపథ్యంలో గెలుపు, ఓటమిలపై బెట్టింగ్‌లు అత్యల్పంగా జరుగుతున్నాయి. అత్యధిక శాతం బెట్టింగ్‌లు 15 వేల నుంచి 30 వేల వరకు మెజార్టీపైనే ఉంటున్నట్లు తెలుస్తుంది. మరికొందరు టీడీపీ వీరా భిమానులు అయితే ఏకంగా రూ.40 వేల పైచిలుకు మెజార్టీపై కూడా బెట్టింగ్‌లు పెట్టినట్లు తెలుస్తుంది. టీడీపీ వైపు ఎక్కువ మంది బెట్టింగ్‌లకు సిద్ధమవుతుండగా వైసీపీ వైపు నుంచి అతి కొద్దిమంది మాత్రమే ముందుకు వస్తున్నట్లు సమాచారం. అదీ కూడా వైసీపీ తరఫున బెట్టింగ్‌లకు వస్తున్న వారిలో అగ్రకు లాల్లోని ఒకే సామాజిక వర్గం వారు కావడం విశేషం. బల్లికురవ మండలంలో ఓ గ్రామ వైసీపీ నేత సైతం టీడీపీ మెజార్టీపై బెట్టింగ్‌కు దిగడం చర్చనీయాంశంగా మారింది. సదరు నేత బెట్టింగ్ సమయంలో ప్రత్యర్థులైన వైసీపీ నేతలతో మాట్లాడుతూ పార్టీ అభిమానం వేరు.. బెట్టింగ్‌లు వేరు.. అన్నట్లు తెలుస్తుంది. ప్రకాశం, పల్నాడు, గుంటూరుకు చెందిన పలువురు అద్దంకిలో మె జార్టీపైనే బెట్టింగ్‌లకు దిగినట్లు తెలుస్తుంది. అద్దంకి పట్టణంలోని రి యల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం బెట్టింగ్‌ల వైపు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. ఇక మండలాలు, గ్రామాలవారీగా కూడా మెజార్టీలపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ విడత సంతమాగులూరులో మెజార్టీపై ఇరువర్గీయులు బెట్టింగ్‌లు పెట్టినట్లు తెలుస్తుంది. పోలీసులు దృష్టి సారిస్తారన్న ఉద్దేశంతో బెట్టింగ్‌లు రహస్యంగా నిర్వహిస్తున్నారు.

3న తెనాలికి పవన్‌కల్యాణ్

తెనాలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి ఈ నెల 3న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి రానున్నారని ఆ పార్టీ పీఏసీ చైర్మన్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పవన్ కల్యాణ్ పర్యటన, బహిరంగ సభను ఒక పండుగలాగా విజయవంతం చేస్తామన్నారు. పవన్ పర్యటనకు సంబంధించి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను సోమవారం మనో హర్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్యేక హెలికాప్టర్‌లో సుల్తానాబాద్ చేరుకునే పవన్ వారాహి వాహనంలో తెనాలిలో పర్యటిస్తారన్నారు. తర్వాత సాయంత్రం 6 గంటలకు మార్కెట్ సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారన్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను మనోహర్ కోరారు. తాము అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టోను సభలో ప్రజల ముందుంచుతారని తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



జమిలి ఎన్నికలు

అనుకూల - ప్రతికూల వాదనలు

(నిన్నటి దిక్సూచి తరువాయి)

అనుకూల వాదనలు

1. మూడుస్థాయిల్లోని ప్రభుత్వాలకు విడివిడిగా ఎన్నికలు నిర్వహించేకన్నా, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం మంచిది. తద్వారా ఎన్నికల నిర్వహణకు మూడుసార్లు అయ్యే అనేక ఖర్చులు తగ్గుతాయి. దేశంపై ఆర్థికభారం తగ్గుతుంది. ఇది ప్రభుత్వంతోపాటు రాజకీయ పార్టీలకు, వాటికి నిధులిచ్చే వాణిజ్య సంస్థలకు భారం తగ్గిస్తుంది.
2. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది మొదలు, పూర్తయ్యేవరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుంది. ప్రభుత్వాలు దైనందిన పాలనా కార్యక్రమాలు మినహా, కొత్త పథకాలు/ కొత్త విధానాలు చేపట్టడానికి అవకాశం ఉండదు. రెండు మూడు నెలలపాటు ఈ పరిస్థితి నెలకొంటుంది. ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు ఒక్కోసారి లోక్‌సభ ఎన్నికలు కూడా జతయై సంవత్సరంలో సగంరోజుల పాటు ఈ క్రియాశూన్యత కనిపిస్తూ ఉంటుంది. జమిలి ఎన్నికలతో అయిదు సంవత్సరాలకు ఒకసారి కొన్ని నెలలకే దీనిని పరిమితం చేయవచ్చు.
3. మానవ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. ఎన్నికల సమయంలో భారీఎత్తున భద్రతా బలగాల తరలింపు, ప్రభుత్వాధికారులకు అదనపు పని ఒత్తిడి ఉంటుంది. జమిలి ఎన్నికల వల్ల వారిపై ఈ భారం ఒక్కసారికే పరిమితం అవుతుంది.
4. తరచూ, ఏదో ఒక స్థాయిలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు నాయకులు నిరంతరం గెలుపు కోసం ప్రచారాలు, వ్యూహరచనలు చేయడంలో నిమగ్నమైపోతారు. ప్రజా సంక్షేమానికి పనిచేసే సమయం ఉండదు. అందువల్ల ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల చేతుల్లోంచి ప్రభుత్వోద్యోగుల చేతుల్లోకి పాలన వెళ్లి అది ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నిస్తుంది.
5. అన్ని స్థాయిల్లో ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల దేశవ్యాప్త అంశాలపై ఎక్కువగా చర్చ జరిగి జాతీయ దృక్పథం అలవడుతుంది. సంకుచిత ప్రాంతీయవాద ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరపడి, దేశ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడుతుంది.
6. తాత్కాలికంగా ఎన్నికల కోసం వైరుధ్య సిద్ధాంతాలున్న పార్టీలు అసంబద్ధ పొత్తులు పెట్టుకోవడం జమిలి ఎన్నికలతో తగ్గుతుంది. సిద్ధాంతపరమైన నిజాయితీకి పార్టీలు కట్టుపడతాయి.
7. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల బుజ్జగింపులు వంటివి తగ్గి పాలనలో స్థిరత్వం పెరిగి పాలకులు పాలనపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉంటుంది.
8. ఏవైనా కఠిన నిర్ణయాలు ప్రజాసంక్షేమం దృష్ట్యా తీసుకోవాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వాలు నిర్భీతిగా వ్యవహరించవచ్చు. అయిదేళ్లకు గానీ ఎన్నికలు మరలా రానందున పదే పదే ప్రజాకర్షక ఉచిత పథకాలు వంటివి ప్రకటించాల్సిన అవసరం రెండు స్థాయిల్లోని అధికార పార్టీలకు ఉండదు. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం నిర్మాణాత్మక కార్యక్రమాలకు మళ్లుతుంది.
9. జమిలితో ఒకేసారి అన్నిస్థాయిల ఎన్నికల్లో ఓటు వేసే సౌలభ్యం ఉంటుంది. ఓటుహక్కు వినియోగించుకోవాలనే నైతిక ఒత్తిడి కూడా ప్రజలపై ఉండి ఓటింగ్ శాతం పెరుగుతుంది.
10. ఓటర్ల జాబితాలో సవరణలు పదేపదే చేయాల్సిన అవసరం ఎలక్షన్ కమిషన్‌కు ఉండదు. ఓటర్లు కూడా తమ ఓటుహక్కును తరచూ తనిఖీ చేసుకోవాల్సిన శ్రమ ఉండదు.
11. ఎన్నికల సమయంలో మత, సైద్ధాంతిక, ప్రాంతీయపరమైన ఉద్రిక్తలు పార్టీల ప్రయోజనాల కోసం రెచ్చగొడుతూ ఉంటారు. ఇటువంటివి తగ్గుతాయి.

ప్రతికూల వాదనలు

1. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించడం అంటే పెద్దఎత్తున రవాణా, ఎన్నికల సామగ్రి అవసరమవుతుంది. ఉదాహరణకు ఇప్పుడున్న ఈవీఎంలకు రెండింతలు ఈవీఎంలు అవసరమవుతాయి. భద్రతా దళాల, మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. ఈవీఎంల భద్రత కూడా ప్రశ్నార్థకం అవుతుంది. శాంతిభద్రతలు అదుపుతప్పినప్పుడు వెంటనే కట్టడి చేయడం కష్టం.
2. భారతదేశ జనాభాలో సాంకేతిక అవగాహన లేనివారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఒకేసారి మూడు నాలుగు ఈవీఎంలను వినియోగించాలంటే వీరు గందరగోళపడి తప్పులు జరగడానికి అవకాశం ఉంది. తదుపరి ఎన్నికలప్పుడు అసలు ఓటు వేయడానికే వీరు ఉత్సాహం చూపకపోవచ్చు.
3. విడివిడిగా ఎన్నికలు జరిగినప్పుడే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులపై ప్రత్యేకంగా ప్రజలు దృష్టి సారించడానికి వీలవుతుంది. ఒకేసారి ఎన్నికలు జరిగినప్పుడు జాతీయస్థాయి చర్చే ప్రధానంగా జరిగి రాష్ట్రాల్లో కూడా జాతీయ పార్టీల ప్రభావం పడే అవకాశం ఉంది. లేదా ప్రాంతీయ పార్టీల వల్ల వర్గ, మత, ప్రాంతీయ అభిమాన ప్రభావాలకు ప్రజలు గురైనప్పుడు వాటికి అనుగుణంగా ఉన్న జాతీయ పార్టీల వైపు మొగ్గు ఏర్పడుతుంది. ఏతావతా ఆయా ప్రభుత్వాల పనితీరు విస్మరించబడుతుంది.
4. ఏదో ఒక ఎన్నికలు ఉండటం వల్ల ప్రభుత్వాలు జాగరూకతతో ఉంటాయి. లేకుంటే నియంతృత్వ పోకడలకు అవకాశం ఉంది.
5. నిధులు సమకూర్చుకోవడంలో, ఎన్నికల ఖర్చులో జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడలేవు. అందువల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి ప్రమాదం ఏర్పడి ప్రాంతీయ సమస్యలు, ఆకాంక్షలు గుర్తింపునకు నోచుకోవు. ఇది అశాంతికి దారితీస్తుంది.
6. జమిలి విధానంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ రద్దు, ముందస్తు ఎన్నికలను కోరే అధికారం కోల్పోతారు. కేవలం కేంద్ర ప్రభుత్వానికే ఎలక్షన్ సంబంధిత నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండి సమాఖ్య లక్షణం ప్రశ్నార్థకమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

నోటిఫికేషన్స్



ఏపీ పీజీసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి- పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌ను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు సహా ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ, మైనారిటీ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంసీజే, ఎం.లైబ్రరీ సైన్స్, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అలాగే తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రతి కోర్సులో 10 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు.

అడ్మిషన్స్ ఇచ్చే యూనివర్సిటీలు: ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ, ఆచార్య నాగార్జున, శ్రీ పద్మావతి మహిళ, యోగి వేమన, రాయలసీమ, విక్రం సింహపురి, ద్రవిడియన్, కృష్ణ, ఆది కవి నన్నయ, డా.బీ.ఆర్.అంబేద్కర్, డా.అబ్దుల్ హక్ ఉర్దు, క్లస్టర్, ఆంధ్ర కేసరి, జేఎన్‌టీయూఏ - ఓటీపీఆర్ఐ, స్విమ్స్-తిరుపతి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్నవారు కూడా అర్హులే. ఎంఏ ఎకనామిక్స్‌లో ప్రవేశానికి బీకాం అభ్యర్థులు; ఎంఏ(లాంగ్వేజెస్)లో ప్రవేశానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ అభ్యర్థులు అనర్హులు.

ఏపీ పీజీ సెట్ 2024 వివరాలు: పీజీసెట్ 2024ను మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. మొదటి కేటగిరీలో ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్; రెండో కేటగిరీలో కామర్స్, ఎడ్యుకేషన్; మూడో కేటగిరీలో సైన్సెస్ సంబంధిత సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి.

- **మొదటి కేటగిరీ టెస్ట్‌లు:** ఇంగ్లీష్, జనరల్, తెలుగు, లిటరేచర్, సంస్కృతం, హిందీ, ఉర్దూ, తమిళం, బీఎఫ్ఏ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్, పర్ఫామింగ్ ఆర్ట్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, టూరిజం
- **రెండో కేటగిరీ టెస్ట్‌లు:** కామర్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్
- **మూడో కేటగిరీ టెస్ట్‌లు:** లైఫ్ సైన్సెస్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సెస్, బోటనీ, సెరీకల్చర్, జువాలజీ, మేథమెటికల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, ఫిజికల్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ సైన్సెస్, పాలిమర్ సైన్స్, జియాలజీ, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ
- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు.
- ఎంపీఈడీ కోర్సుకు మాత్రం అభ్యర్థులు క్రీడల్లో సాధించిన విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. దీనికి కూడా 100 మార్కులు కేటాయించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.850; బీసీ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.650
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 4
- **ఏపీ పీజీ సెట్ 2024 తేదీలు:** జూన్ 10 నుంచి 14 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

సిపెట్ అడ్మిషన్ టెస్ట్

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)- అడ్మిషన్ టెస్ట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. వయో పరిమితి నిబంధనలు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. హైదరాబాద్ క్యాంపస్‌లో అన్ని ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ క్యాంపస్‌లో పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్ లేదు. మహిళలకు, పురుషులకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పాలిమర్స్, ప్లాస్టిక్స్, పెట్రోకెమికల్స్, మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ విభాగాలకు సంబంధించి ప్రొఫెషనల్/టెక్నికల్ ట్రెయినింగ్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా స్టయిపెండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌లు కూడా ఉంటాయి. ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: బీఎస్సీ ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత రెండేళ్ల వ్యవధిగల కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ-క్యాడ్/క్యామ్): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. మూడు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: మూడేళ్ల డిప్లొమా(మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/టూల్/టూల్ అండ్ డై మేకింగ్/ప్రొడక్షన్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్-మెకట్రానిక్స్/ఆటొమొబైల్/పెట్రో కెమికల్స్/ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీ) లేదా సిపెట్ నుంచి డీపీఎంటీ/డీపీటీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 వివరాలు: దీనిని కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. అర్హత కింద నిర్దేశించిన కోర్సు సిలబస్, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ కింద స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. డీపీటీ, డీపీఎంటీ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 25, సైన్స్ సబ్జెక్ట్ నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 5 ప్రశ్నలు అడుగుతారు. పీజీ డిప్లొమా ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలు; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మేథ్స్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు ఇస్తారు. పోస్ట్ డిప్లొమాకు నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 20; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; ప్లాస్టిక్స్/పాలిమర్స్, టూల్స్ రూం, ఇండస్ట్రియల్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. నెగెటివ్ మార్కులు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 తేదీ:** జూన్ 9
- **వెబ్‌సైట్:** https://cipet24.onlineregistrationform.org/CIPET/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/b8sZJaRలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

టిల్లు స్క్వేర్ చూసి ఎంజాయ్ చేశా



చిరంజీవి

ఇటీవల విడుదలై విజయం సాధించిన 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని చూసి మెగాస్టార్ చిరంజీవి బాగా ఎంజాయ్ చేశారు. వెంటనే ఆయన చిత్ర బృందాన్ని తన ఇంటికి పిలిపించుకొని ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఆయన ఆహ్వానంపై హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక్ రామ్, నిర్మాత నాగవంశీ చిరు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఒక సినిమా హిట్ అయి, దానికి సీక్వెల్‌గా మరో చిత్రం వస్తుంటే అంచనాలు భారీ స్థాయిలో ఉంటాయి. వాటిని అందుకోవడం అంత తేలికైన విషయం కాదు. కానీ హీరో సిద్ధు, దర్శకుడు మల్లిక్‌రామ్, నిర్మాత నాగవంశీ.. ఇతర టీమ్ అంతా కలసి ప్రేక్షకులు మెచ్చేలా 'డీజె టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'ను అందించడంలో విజయం సాధించారు. అదే ఉత్కంఠ, అదే సరదా, అదే నవ్వుల జల్లు. నటుడిగా, కథకుడిగా వ్యవహరించి, ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి ప్రధాన కారణమైన సిద్ధును అభినందిస్తున్నాను.ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డామో, నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపామో అని సిద్ధు నాతో చెప్పాడు. దర్శకుడు మల్లిక్ రామ్, ఎడిటర్ నవీన్ నూలి సహా అందరి సమష్టి కృషి ఉందని తెలిపాడు. విజయం సాధించిన దర్శకనిర్మాతలకు నా శుభాకాంక్షలు. 'మ్యాడ్' చిత్రంతో దర్శకుడిగా ఆకట్టుకొన్న కల్యాణ్ ఈ సినిమా రచనలో సహకారం అందించాడని విన్నాను. కేవలం యువతనే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా తీశారు. ఈ సినిమా చూసి నేను బాగా ఎంజాయ్ చేశా. మీరు చేయండి' అన్నారు.

ఫ్యామిలీ ఆడియెన్స్ మెచ్చుకునేలా...

విజయ్ దేవరకొండ, మృణాల్‌ఠాకూర్ నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించారు. దిల్ రాజు,శిరీశ్ నిర్మించారు. ఈ నెల 5న 'ఫ్యామిలీ స్టార్' విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ వేడుకకు నిర్మాత దిల్‌రాజు, విజయ్ దేవరకొండ సంప్రదాయ దుస్తుల్లో హాజరుకావడం విశేషం. దిల్‌రాజు మాట్లాడుతూ "ఫ్యామిలీ స్టార్ సినిమా విషయంలో ప్రతీ విషయంలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. డైరెక్టర్ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎక్సైట్ చేసింది. ఈ సినిమాకు విజయ్ క్యారెక్టర్ వెన్నెముక లాంటిది. ఇది 30 శాతం ఫ్యామిలీ స్టోరీ, 70 శాతం లవ్ స్టోరీ. మృణాల్ లక్కీ హీరోయిన్. ఈ చిత్రంతో తెలుగులో ఆమె హ్యాట్రిక్ అందుకుంటుంది" అని అన్నారు. విజయ్ మాట్లాడుతూ "మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని చెప్పే వ్యక్తి ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. ఈ సినిమాకు, 'గీతాగోవిందం' సినిమాకు ఏ పోలిక ఉండదు. ఈ కథ వింటున్నప్పుడు మా నాన్న గుర్తొచ్చారు. అందుకే ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి మా నాన్న పేరు గోవర్ధన్ అని పెట్టాం" అని చెప్పారు. మృణాల్ మాట్లాడుతూ "సీతారామం, హాయ్‌నాన్న తర్వాత నా నెక్ట్స్ తెలుగు ప్రాజెక్ట్ కోసం చాలా కథలు విన్నా. ఈ సినిమా కథ నాకు నచ్చడంతో వెంటనే ఒప్పేసుకున్నాను. మన జీవితాల్లోని ఎమోషన్స్, రిలేషన్స్, అచీవ్‌మెంట్స్, స్ట్రగుల్స్ అన్నీ ఈ మూవీలో రిలేట్ చేసుకుంటారు" అని తెలిపారు.



కమల్ హాసన్ మెచ్చుకున్నారు



మలయాళ మూవీ ఇండస్ట్రీలో లేటెస్ట్ సెన్సేషన్ 'మంజుమ్మెల్ బాయ్స్'. మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి సినిమాగా నిలిచింది. తమిళనాడులోని గుణ కేవ్స్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన స్ఫూర్తితో చిదంబరం ఎస్ పొదువల్ దీనిని తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ ఏప్రిల్ 6న ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ మీద ముందు నుంచి అందరికీ నమ్మకం ఉంది. కానీ రూ.200 కోట్లు కలెక్ట్ చేస్తుందని ఎవరూ ఊహించలేదు. నా సెకండ్ సినిమా కథ కోసం అన్వేషిస్తుండగా గుణ కేవ్స్‌లో జరిగిన ఈ సంఘటన గురించి తెలిసింది. నన్ను ఈ కథ ఎంతగానో ఎక్సైట్ చేసింది. వెంటనే వర్క్ స్టార్ట్ చేసి, రియల్ లైఫ్ మంజుమ్మెల్ బాయ్స్‌ను కలిశా. వారు జరిగిందంతా చెప్పారు. విన్నాక ఇది ప్రజలకు తెలియాల్సిన కథ. సినిమా తీయాలి అని మరింత దృఢంగా నిశ్చయించుకున్నాను. సినిమా చూసిన కమల్ హాసన్ మెచ్చుకోవడం పెద్ద అవార్డు గెలుచుకున్నట్లనిపించింది. మలయాళీలకు తెలుగు సినిమాలు అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను. తెలుగులో ఎంతో మంది మంచి నటులు ఉన్నారు. వారితో సినిమా చేసే అవకాశం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు.



'ఓ భామ అయ్యో రామ'



వైవిధ్యమైన చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన హీరోగా నటిస్తున్న మరో వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవిక మనోజ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రామ్ గోదాల దర్శకత్వం వహిస్తున్నారు. హరీశ్ నల్లా, ప్రదీప్ తాళ్లు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని ప్రారంభించి టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ "దర్శకుడు మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు" అని తెలిపారు. 'నువ్వు నేను' ఫేమ్ నటి అనిత హస్సనందని మాట్లాడుతూ "నా సెకండ్ ఇన్నింగ్స్‌కు పర్‌ఫెక్ట్‌గా కుదిరిన చిత్రమిది" అని చెప్పారు. దర్శకుడు రామ్ గోదాల మాట్లాడుతూ "ఇదొక బ్యూటిఫుల్ లవ్‌స్టోరి" అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమాకు ప్రారంభం నుంచే మంచి పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, డైరెక్టర్స్ వశిష్ఠ, విజయ్ కనకమేడల, శైలేశ్ కొలను పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్ ఎమ్.షా, సినిమాటోగ్రాఫర్: మణికందన్, సంగీతం: రథన్, కోప్రొడ్యూసర్: ఆనంద్ గడగోని.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/C5zBRWR లో చదవండి.

దర్శకుడు, అనువాద రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూత



దర్శకుడు, అనువాద మాటల రచయిత శ్రీ రామకృష్ణ(74) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించటంతో సోమవారం రాత్రి 8 గంటలకు తేనాంపేటలోని అపోలో హాస్పిటల్‌లో కన్నుమూశారు. శ్రీరామకృష్ణ స్వస్థలం తెనాలి. 50 ఏళ్ల కిందట చెన్నైలో స్థిరపడ్డారు. ఆయనకు భార్య స్వాతి, కుమారుడు గౌతమ్ ఉన్నారు. ముంబై, జెంటిల్మన్, చంద్రముఖి తదితర 300 చిత్రాలకు పైగా అనువాద రచయితగా పనిచేసిన శ్రీ రామకృష్ణ... 'బాలమురళి ఎంఏ', 'సమాజంలో స్త్రీ' చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనువాద రచనలో రాజశ్రీ తర్వాత తనకుంటూ ఒక ప్రత్యేకత ఏర్పరచుకున్న శ్రీరామకృష్ణ మణిరత్నం, శంకర్ దర్శకత్వం వహించిన అన్ని చిత్రాలకు తెలుగులో మాటలు రాశారు, రజనీకాంత్ 'దర్బార్' చిత్రానికి చివరిగా మాటలు అందించారు. ఆయన పార్థివదేహానికి మంగళవారం ఉదయం సాలిగ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరుగుతాయని ఆయన కుమారుడు గౌతమ్ తెలిపారు.

చెన్నై(ఆంధ్రజ్యోతి)

6న వినుకొండకు చంద్రబాబునాయుడు

వినుకొండటౌన్, ఏప్రిల్1: ప్రజాగళం కార్యక్రమంలో బాగంగా ఈనెల 6 తేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ్య అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వినుకొండలో పర్యటించనున్నట్లు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం తెలిపారు. కావున పార్టీ నాయకు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రజాగళం కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గురుకుల విద్యాలయ ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు(విద్య), చిలకలూరిపేట ఏప్రిల్ 1: గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగించినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాలయాల్లో 2024-25 సంవత్సరాల్లో 5వ తరగతి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేయడానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఏపీఆర్‌జేసీ(ఇంటర్), ఏపీఆర్‌డీసీ(డిగ్రీ) ద్వారా కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసే గడువు ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయాలి : ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, ఏప్రిల్1: సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు అవతాత్తల పెన్షన్ల పేరుతో జగన్‌రెడ్డి సరికొత్త నాటానికి తెరతీసారన్ని ఎద్దేవా చేశారు. వలంటీర్లు మా సొంత కార్యకర్తలేనని విజయసాయి రెడ్డి, ధర్మాన ప్రసాదరావు బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో 15 వేల సచివాలయాల్లో 1,50,000 మంది సిబ్బంది ఉన్నారన్నారు. 60 లక్షల సామాజిక పింఛన్లు ఈ సిబ్బంది ద్వారా ఒక్కొక్కరికి 40 చొప్పున ఒక పూటలో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయించవచ్చన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘాన్ని చీఫ్ సెక్రటరీని తెలుగుదేశం బృందం కలిసి విన్నవించిన్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు : జీవీ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1: పింఛన్ల సొమ్ముతోపాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు తన సొంత కాంట్రాక్టర్లకు జగన్‌మోహన్‌రెడ్డి దోచిపెట్టారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయలు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. తన దుర్మార్గాన్ని కప్పి పెట్టుకోవడానికి జగన్‌రెడ్డి ఎన్నికల కమీషన్ పైన, నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పైన విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. పింఛన్‌దారుల పట్ల వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే ఖజానాలో ఉన్న డబ్బును కాంట్రాక్టర్లకు దోచి పెట్టేవాడు కాదన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించ లేకపోవడానికి జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన నిధులు కొరతే కారణమని, ఎన్నికల కమీషన్, తెలుగుదేశంపార్టీ కాదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటివద్దకే నెలకు రూ.4 వేలు పెన్షన్ అందిస్తామని అన్నారు. పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే చేయించాలని డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ.. రూ.12 లక్షలు స్వాధీనం

చిలకలూరిపేట, ఏప్రిల్ 1: జాతీయ రహదారిపై చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు జరుపుతుండగా ఒక కారులో తరలిస్తున్న రూ.12 లక్షలు నగదు పట్టుబడ్డాయి. పోలీసులు ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు నుంచి గుంటూరుకు వెళ్తున్న వారిలో ఈ మొత్తం దొరికింది. కారులో ప్రయాణం చేస్తున్న ప్రకాశం జిల్లా పెద్దచర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్ళూరి తిమోతి అనే వ్యక్తి వద్ద నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వలంటీర్ల తొలగింపు

దాచేపల్లి, ఏప్రిల్ 1: గామాలపాడులో ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో వెంకటరమణ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ సిలార్‌బాషా రాజకీయ పార్టీల నాయకులను ఉద్దేశించి పోస్టులు పెడుతూ పింఛన్ తీసుకునే వారిని భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. బైరపోగు వినయ్ అనే వలంటీర్ రాజకీయ పార్టీల ఫంక్షన్లకు హాజరుకావడంతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నట్లుగా భావించి విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.



CHANGE OF NAME

I, Shaik Basha H.no: 14-5-88/80, ward-31, vijayalaxmipuram, Bapatla, AP, my name Syed Basha to Shaik Basha has changed for all purposes.
AJH-56591

I, Shaik Begum Jani W/o Shaik Basha. Residing at H.no: 14-5-88/80, ward-31 Vijayalakhmipuram, Bapatla Town, AP. Have my name changed Syed Begum Jani to Shaik Begum Jani for all Purposes
AJH-56593

I, Tirumala Venkata Rama Devi (Old name), W/o Tirumala Ravi Kumar, R/o.D.No.14/161, 3rd line sampath nagar, Kothapeta, Chirala-523157, Changing my name from Tirumala Venkata Rama Devi (Old name) to TIRUMALA RAMA DEVI (New name). Hence forth being called as TIRUMALA RAMA DEVI for all purposes
AJH-56685

ఆయుర్వేదం

అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేక పోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికాఔషధం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సిహెచ్.రామకృష్ణ VJA. సెల్ : 84650 56299
AJB-1078

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును


బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-182113

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 99639 84109
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 91103 23914
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

జంగా.. రాజీనామా

- వైసీపీ సభ్యత్వానికి, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి..
- నేటి రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి
- సామాన్యుడు రాజకీయాల్లో కొనసాగటం కష్టంగా ఉంది
- 2019లో గురజాలను కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశా
- ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులోని జంగా కృష్ణమూర్తి స్వగృహంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకుల మధ్య రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జంగా మాట్లాడుతూ 2019లో గురజాల నియోజకవర్గ సీటును కాసు మహేష్‌రెడ్డి కోసం త్యాగం చేశానని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించిన నెలకే గురజాల నియోజక వర్గంలోని పిడుగురాళ్ల నుంచి ప్రజలతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీభవన్ వరకు రాజశేఖర్‌రెడ్డికి భారతరత్న అవార్డు ఇవ్వాలని, జగన్మోహన్‌రెడ్డికి సీఎం పదవి ఇవ్వాలని పాదయాత్ర చేశానన్నారు. వైసీపీ నిర్మాణ కమిటీలో పబ్లిసిటీ కార్యదర్శిగా పని చేశాను. సీఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీ పెట్టకముందు నుంచి ఆయనతో కలిసి ప్రయాణం చేసిన పది మందిలో నేనొకడిని. కానీ పదవు లిస్తేనే సామాజిక న్యాయం రాదు.. దానికి తగిన గౌరవం, మర్యాద కూడా ఇవ్వాలి. కానీ అవి ఏవీ లేవు. గత 14 సంవత్సరాల్లో పార్టీలో ఎన్నో ఒడిదుడుకులు, ఇబ్బందులు, అవమానాలు భరాయించాను. ఈ విషయాన్ని ఎన్నోసార్లు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లాను. కానీ దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రజాప్రతినిధులంటే ప్రజల సొమ్ముకు ధర్మకర్తలా వుండాలి. కానీ దానికి భిన్నంగా నేటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజల సొమ్మును తన సొమ్ముగా భావిస్తున్నారు. ఇది భరించలేనటువంటి ఇబ్బంది అన్నారు. రాజకీయాల్లో ఇదే నా ఆఖరి మజిలీ కావచ్చు. ఎస్సీ ఎస్టీబీసీ, మైనారిటీలకు అండగా వుంటా. నా తుది శ్వాస వరకు బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తా. గత ఐదేళ్లలో నన్ను నమ్ముకొని వున్న వారికి న్యాయం చేయలేకపోయా. అది నాకు ఎంతో బాధను గురి చేసింది. ఈ నెల 5, 6 తేదీల్లో లోకేష్ గురజాల నియోజకవర్గానికి రానున్న తరుణంలో పార్టీలో చేరతాను. క్రియాశీలకంగా పనిచేస్తానని జంగా వివరించారు. ఇప్పటికైనా నేను నా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్లడం లేదు. బీసీ, ఎస్సీ ఎస్టీలకు సరైన గుర్తింపు, సామాజిక న్యాయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. వైసీపీని వీడటం కష్టంగా వున్నప్పటికీ పేద ప్రజల కోసం, నన్ను నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు పార్టీని వీడుతున్నట్లు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి స్పష్టం చేశారు. ఇప్పటివరకు తనకు సహకరించిన పెద్దలు, బీసీ వర్గ శ్రేణులు, ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు జంగా తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, అంబటి నవకుమార్, మాజీ జడ్పీటీసీ కోగంటి శివన్నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, కాపు నాయకులు కొప్పుల గిరి, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, తగుళ్ల పెదపిచ్చయ్య, మాశెట్టి పుల్లారావు, మాశెట్టి బుజ్జి, పగడాల భాస్కరరావు, బొమ్మిరెడ్డి సత్యం, కొక్కెర కొండలు, యారాసి వెంకటరావు, వేమవరం ఎంపీటీసీ శానంపూడి శ్రీనివాసరెడ్డి, జక్కా అనంతరామయ్య, కౌన్సిలర్లు షరీఫ్, మహంకాళి నీలంరాజు, ముండ్లపాటి సాంబశివరావు, సీతయ్య, గద్దల వేదమణి, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు చెందిన నాయకులు, అభిమానులు పాల్గొని జంగాకు శాలువా కప్పి తమ మద్దతు తెలిపారు.



గామాలపాడులోని జంగా కృష్ణమూర్తి నివాసంలో సమావేశమైన టీడీపీ, జనసేన నేతలు

నేడు, రేపు వ్యవసాయ కళాశాలలో జాతీయ సదస్సు

బాపట్ల, ఏప్రిల్ 1: బాపట్ల వ్యవసాయ కళాశాలలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల జాతీయ స్థాయి శాస్త్రసాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ తెలిపారు. సదస్సుకు సంబంధించిన ఆహ్వానపత్రాలను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు వ్యవసాయం, వ్యవసాయశాస్త్ర, సాంకేతిక విభాగాల ఆలంబనతో నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ దిశగా రైతుల ఆర్థిక స్థితి గతులను మెరుగు పర్చటం అనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. పలు రాష్ట్రాలు నుంచి పీజీ, పి.హెచ్‌డి విద్యార్థులు 750 మందికి పైగా విచ్చేసి పరిశోధన పత్రాలు సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ వి.శ్రీనివాసరావు, డాక్టర్ డీడీ స్మిత్, డాక్టర్ ఎల్.ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ డి.వి. సాయిరాంకుమార్, సహాయ ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ లాల్ అహ్మద్, డాక్టర్ వి.వెంకటవిశ్వతేజ, విద్యార్థి ఆర్గనైజింగ్ సెక్రటరీలు అక్షయ్, నగేష్, సందీప్‌వర్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఎవి.రమణ తదితరులు

బాపట్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జేడీ శీలం



బాపట్ల, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థిగా మరోసారి జేడీ శీలం పోటీ చేయనున్నారు. కాకుమాను మండలం పుసులూరు గ్రామానికి చెందిన శీలం గతంలో ఐఏఎస్ అధికారిగా అనేక ప్రాంతాల్లో పనిచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి 1999 లోకసభ ఎన్నికల్లో బాపట్ల నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ 2009 నుంచి 2014 వరకు రాజ్యసభ సభ్యుడిగా చేశారు. 2013 నుంచి 2014 వరకు కేంద్ర సహాయమంత్రిగా పనిచేశారు. రాష్ట్రవిభజన తర్వాత 2019 ఎన్నికల్లో కూడా బాపట్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి అతిస్వల్ప ఓట్లు మాత్రమే సాధించి ఓటమి పాలయ్యారు. తిరిగి పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధ కాగా అధిష్ఠానం ఆయన పేరును ప్రకటించింది.

వేమూరు వైసీపీ అభ్యర్థికి నోటీసు

అమృతలూరు, ఏప్రిల్ 1: వేమూరు వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబుకు నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు సోమవారం నోటీసులు జారీ చేశారు. అమృతలూరు మండలం కూచిపూడిలో ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ ఎన్నారైలు తిరిగి తమ దేశాలకు వెళ్లే పరిస్థితి ఉండదంటూ బెదిరిస్తూ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు మీడియాలో ప్రచురితమవగా, సోషల్ మీడియాలో వైరల్‌గా మారియి. దీంతో స్పందించిన ఎన్నికల నియోజకవర్గ అధికారి అశోక్‌బాబును వివరణ కోరుతూ నోటీసు జారీ చేశారు.

వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా..

ముస్లింలను క్షమాపణ కోరిన పెమ్మసాని

మేడికొండూరు: ఏప్రిల్ 1: వీలైనంత వరకు ఎవరికైనా ఉపకారం చేసే వ్యక్తినే తప్ప ఇబ్బంది పెట్టే వ్యక్తిని కానని ముస్లింల మనోభావాలకు ఇబ్బంది కలిగినందున తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ క్షమాపణ కోరుతున్నట్లు టీడీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఫిరంగిపురం మండలంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి డాక్టర్ పెమ్మసాని సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వేములూరుపాడు, అమీనాబాద్, ఫిరంగిపురం, రేపూడి, గొల్లపాలెం తదితర గ్రామాల్లో రోడ్‌షో జరిగింది. పర్యటనలో భాగంగా అమీనాబాద్ గ్రామంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ లాంలో పలువురు వైసీపీకి చెందిన ముస్లింలు టీడీపీలో చేరితే వారిని వైసీపీ నాయకులు చెదిరించగా వారిలో మనోధైర్యాన్ని నింపేందుకే తాను కొన్ని వ్యాఖ్యలు చేశానన్నారు. ఆ వ్యాఖ్యలు కొందరు ముస్లింలకు ఇబ్బంది కలిగించాయని తెలిసిన వెంటనే తాను ఆ వ్యాఖ్యలను ఉపసంహరించున్నానన్నారు. చాలా మందిలో బీజేపీ పొత్తుపై కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, అయితే 2014 - 19 మధ్యలో టీడీపీ, బీజేపీ పొత్తులో ఉన్నా ఏ ఒక్క ముస్లింకు అన్యాయం జరగలేదని తెలిపారు. వేములూరుపాడు, అమీనాబాద్ గ్రామాల్లో కొండేపాక సాంబశివరావు, పీలా గోపి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 60 కుటుంబాలకు టీడీపీ కండువా కప్పి పెమ్మసాని పార్టీలోకి ఆహ్వానించారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

పవర్ లేని మంత్రిగా సుచరిత

వేములూరిపాడులో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సుచరిత గతంలో హోం మంత్రిగా ఉంటూ కనీసం కానిస్టేబుల్‌ను కూడా మార్చలేని దుస్థితిలో పనిచేశారని ఆరోపించారు. దళిత మహిళ అయి ఉండి రాష్ట్రంలో ఎంతోమంది దళితులపై ధమనకాండ జరుగుతున్నా స్పందించలేని స్థితిలో ఉన్నారన్నారు. ఆమె బంధువుల మాత్రం ఎక్కడికి అక్కడ ఆర్థిక వనరులే లక్ష్యంగా దోచుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్లు నిర్మాణం జరిగాయి అంటే అది శ్రావణ్‌కుమార్ హయాంలోనే అన్నారు. సాగునీరు లేక రైతులు కన్నీళ్లు పెట్టుకోవడం చూడలేక, ఉద్యోగాలు లేక యువత బాధపడుతుంటే చూడలేక తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ ప్రభుత్వాన్ని రాజకీయ సమాధి చేయాలని పెమ్మసాని పిలుపునిచ్చారు.

గ్రూప్-1 మూల్యాంకనంలో అవినీతిపై ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 1: గ్రూపు - 1 మెయిన్ ఎగ్జామ్ పేపర్ మూల్యాంకనంలో అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, విశ్రాంత డీజీపీ గౌతమ్‌సవాంగ్, పోలీసు అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలపై రెండో పట్టణ ఎస్ఐ సతీష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2018 గ్రూపు - 1 మెయిన్స్ నోటిఫికేషన్‌కు సంబంధించి 2019లో జరిగిన ప్రిలిమ్స్‌లో అర్హులైన వారికి 2020లో జరిపిన ప్రధాన పరీక్షల డిజిటల్ మూల్యాంకనంలో ఓఎంఆర్ షీట్లు మార్చి వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుతీ, వెంకటరావు, షేక్ రఫీ, కూరపాటి హనుమంతరావు, షేక్ నాగూర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఐ సతీష్‌కు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నేతలు

పల్లెల్లో కూటమికి విశేష ప్రజాదరణ


- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 1: చిలకలూరిపేటతో పాటు ప్రతి నియోజకవర్గంలో ప్రజలంతా కూటమి పార్టీల వైపు చూస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం గ్రామానికి చెందిన 11 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. పట్టణంలోని మాజీ మంత్రి నివాసంలో వారందరికీ పార్టీ కండువాలు కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రచారానికి వెళ్ళిన ప్రతిచోట ప్రజాదరణ కన్పిస్తుందన్నారు. పార్టీ నేతలు సమన్వయం చేసుకుని వైసీపీ గూండాల బారిన పడకుండా ప్రజలను పోలింగ్ బూత్ వద్దకు తీసుకురావాలన్నారు. సూపర్ 6 పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యాయని, మరింత మందికి వాటిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, రైతు నాయకులు అంబటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రత్తిపాటి

మద్యం మత్తులో కొడుకు హతం



గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 1: మద్యం మత్తులో కన్న కొడుకుని కడతేర్చాడు ఓ తండ్రి.. పాత గుంటూరులోని క్రిస్టియన్‌పేటలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసుల కథనం ప్రకారం... పాత గుంటూరులోని క్రిస్టియన్‌పేటకు చెందిన తమనం కవిరాజు, అతని కుమారుడు మోజెస్ పాల్(29) ప్లంబర్లుగా పని చేస్తుంటారు. తండ్రీ, కొడుకు ఇద్దరు కలిసి మద్యం సేవిస్తూ ఉంటారు. మోజేష్ పాల్ కొద్దిరోజులుగా పెళ్లి చేయమని తండ్రితో తరచు గొడవ పడుతున్నాడు. ఆదివారం వారిద్దరి మధ్య బైక్ విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తండ్రిపై కొడుకు మోజెస్ పాల్ చేయి చేసుకున్నాడు. దీంతో కోపద్రిక్తుడైన కవిరాజు పక్కనే ఉన్న మంచం కోడు తీసుకొని కొడుకుపై కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు మోజెస్ పాల్ అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు. పాత గుంటూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడు తల్లి శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజు, ఎస్పీ వకుల్ జిందాల్

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలి

- గుంటూరు రేంజ్ డీఐజి జి.పాలరాజు

బాపట్ల, ఏప్రిల్ 1: పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ సమర్థంగా విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు తెలిపారు. బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలు గురించి ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన సమీక్షించారు. సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి చెడు నడత కలిగిన వ్యక్తులను బైండోవర్ చేయాలని తెలిపారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా వారిలో భరోసా కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరెస్టు వారెంట్లను వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా రవాణా జరిగే నగదు, మద్యాన్ని, ప్రజలను ప్రలోభాలకు గురిచేయటానికి ఉపయోగించే బహుమతులు, వస్తువులను కట్టడి చేయాలన్నారు. రోజు ఫ్లాగ్‌మార్చ్‌లు, ఫుట్‌పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఏఆర్‌డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ వి.మలికార్జున, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.మురళీకృష్ణ, ఎలక్షన్ సెల్ సీఐలు కె.శ్రీనివాసురెడ్డి, సి.హెచ్. గంగయ్య, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోను ప్రజల చెంతకు చేర్చండి

- ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



ప్రసంగిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు

అమరావతి, ఏప్రిల్ 1: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, రైతులు, మహిళలకు అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల మ్యానిఫెస్టోను వారి ముంగిటకు తీసుకు వెళ్లాలని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. సోమవారం మండలంలోని పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి, నరుకుళ్లపాడు, లేమల్లె, నెమలికల్లు, ముత్తాయపాలెం గ్రామా ల్లో పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌తో కలసి ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి నాయకుడు వ్యక్తిగత ద్వేషాలకు స్వస్థిపలికి అందరితో కలసి టీడీపీ కూటమికి మద్దతు పలికేలా కృషి చేయాలన్నారు. నరసరావుపేట ఎంపీగా తనను, పెదకూరపాడు శాసన సభ్యునిగా భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా నాయకులు పనిచేయాలన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సాగునీరు, రహదారుల సమస్యలు ఉన్నట్లు గమనించడం జరిగిందని అధికారంలోకి రాగానే సత్వర పరిష్కార చర్యలు చేపడతామన్నారు. పర్యాటక కేంద్రంగా అమరావతిని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కన్నా రజని మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం 75 సంవత్సరాల వయస్సులో ఎండను లెక్కచేయకుండా సమావేశాలు నిర్వహిస్తున్న చంద్రబాబునాయుడు ను ఆదర్శంగా తీసుకుని వైసీపీ పాలనను అంతమొందించి ఉమ్మడి కూటమి ప్రభుత్వం వచ్చేలా మూడు పార్టీల నాయకులు కలసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, వెన్నా సాంబశివారెడ్డి, ఎం.గంగాధర్, ఎం.విష్ణు, కె.వసంతరావు, వి.ధర్మారావు పాల్గొన్నారు.

ఎండ్రాయి ఎంపీటీసీ టీడీపీలో చేరిక



ఎంపీ కృష్ణదేవరాయలు, భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన శివయ్య

అమరావతి, ఏప్రిల్1: మండలంలోని ఎండ్రాయి గ్రామ ఎంపీటీసీ సభ్యులు దేవబత్తిన శివయ్య సోమవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎండ్రాయి గ్రామంలో జరిగిన కార్య క్రమంలో ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎంఎల్ఏ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరడం జరిగింది. కృష్ణదేవరాయలు శివయ్యకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక పాలన వలన విసుగు చెంది వైసీపీ నుంచి టీడీపీలో చేరినట్లు శివయ్య తెలిపారు.

పింఛన్ల సొమ్ము పక్కదారి పట్టించిన జగన్

- టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇంటి వద్దకే రూ.4 వేలు పింఛన్
- యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ళ, ఏప్రిల్1: పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు వేల కోట్ల రూపాయలను ఎన్నికల కోడ్ అమలులో వున్నా సొంత కాంట్రాక్టర్లకు జగన్ దోచి పెట్టారని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీన ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్ ఎందుకు ఆదేశాలు జారీచేయలేదని, రాష్ట్రంలో 1.35 లక్షల మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా యుద్ధప్రాతిపదికన పింఛన్లను ఇంటివద్దనే పంపిణీ చేసే అవకాశం వున్నా జగన్ స్వార్థరాజకీయాల వల్లనే పింఛన్‌దారులు నేడు పింఛన్ సొమ్ము తీసుకోలేకపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటివద్దకే నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తామని, సకాలంలో ఇంటివద్ద లేకపోయినా పొరుగు ఊర్లలో వున్న వారికి తరువాత నెలైనా కలిపి పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. ఎప్పటిలాగే నేడు కూడా సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్లవద్దనే పింఛన్ పంపిణీ చేయకపోతే సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిపై ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగన్ తన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల కమిషన్, నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తెలుగుదేశంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వలంటీర్లను ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా చేసి వందల మందిని సస్పెన్షన్ చేయించడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు జగన్మోహన్‌రెడ్డి కారకులయ్యారన్నారు.

పాలవ్యాన్ ఢీకొని యువకుడి మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్1: జాతీయ రహదారిపై పట్టణంలోని విజయ బ్యాంక్ సెంటర్‌లో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక కుమ్మరికాలనీకి చెందిన రావూరి రామకృష్ణ(27), అతని స్నేహితుడు డేనియల్(22) తెల్లవారుజామున 2 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న పాలవ్యాన్ ఢీకొంది. ఈ వ్యాన్ జాతీయ రహదారిపై ఉన్న గ్రిల్స్‌ను ధ్వంసం చేసుకుంటూ పక్కకు వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా డేనియల్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన యువకుడిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

బాపట్ల వార్తలు

ఎంపీ సాక్షిగా వైసీపీలో విభేదాలు బహిర్గతం

● పార్టీ కండువాలు, జెండాలతో ఎంపీ సురేష్, హనిమిరెడ్డి ప్రార్థనలు



కొప్పెరపాడులో ఎంపీ సురేష్ సమక్షంలోనే వాదనకు దిగిన మహిళ

బల్లికురవ, ఏప్రిల్ 1: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పెరపాడు వచ్చిన ఎంపీ నందిగం సురేష్ సమక్షంలోనే వైసీపీలో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. చర్చిలోకి వైసీపీ జెండాలు, కండువాలు ధరించి వచ్చి మరీ వైసీపీలోకి రెండు వర్గాల వారు వాదనలకు దిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ నందిగం సురేష్, వైసీపీ అద్దంకి అభ్యర్థి పాణెం హనిమిరెడ్డిలు గ్రామంలో పర్యటించి ఎస్సీ కాలనీలో ఉన్న చర్చికి వచ్చారు. అయితే వైసీపీలోని ఓ వర్గానికి చెందిన ఓ మహిళ మరో వర్గానికి చెందిన యువ నేతను ఉద్దేశించి ఇక్కడకి ఎందుకు వచ్చావు.. బయటకు వెళ్లు అని అన్నారు. దీంతో రెండు వర్గాల మధ్య ఎంపీ సమక్షంలోనే వాదోపవాదనలు జరిగాయి. ఎస్సీ కాలనీలో కొంతకాలం నుంచి రెండు వర్గాల మధ్య వివాదం ఉంది. ఈ క్రమంలో ఎంపీని ఎన్నికల ప్రచారానికి తాము తీసుకువచ్చామంటే, తాము తీసుకువచ్చాం అంటూ రెండు వర్గాల వారు పంతాలకు పోయి వాదనకు దిగారు. ఇరువర్గాల వారికి పెద్దలు నచ్చజెప్పి వారిని చర్చి నుంచి బయటకు పంపటంతో వివాదం సద్దుమణిగింది. ఎస్సీ కాలనీలో వివాదాలు అటు ఉంచితే ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎంపీ సురేష్, హనిమిరెడ్డిలు చర్చిలోకి పార్టీ కండువాలతో వెళ్లడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.

పది మూల్యాంకనం ప్రారంభం : డీఈవో నారాయణరావు

బాపట్లటౌన్, ఏప్రిల్ 1: పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో ప్రారంభమైందని డీఈవో కె.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాపట్ల మూల్యాంకన కేంద్రానికి లక్షా 65వేల పేపర్లు మూల్యాంకనం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటలు నుంచి సాయంత్రం 6గంటలు వరకు ఉపాధ్యాయులు మూల్యాంకనం విధులను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ప్రతిరోజు ఒక్కో ఉపాధ్యాయుడు 40 జవాబుపత్రాలు మూల్యాంకనం చేసేటట్లు చర్యలు తీసుకున్నామన్నారు. మూల్యాంకనం ఆర్డర్స్ అందుకున్న ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు తక్షణమే రిలీవ్ చేసి మూలాల్యకనానికి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు ఆదేశాలిచ్చామన్నారు. తొలిరోజు 494 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్‌లుగా నియమించామని తెలిపారు. మూల్యాంకనం కేంద్రం వద్ద మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు.

మంత్రి నాగార్జున పరామర్శ గుట్టును బట్టబయలు చేయాలి

● కొల్లా వీరయ్యచౌదరి

బాపట్లటౌన్, ఏప్రిల్ 1 : ఈదుమూడి గ్రామంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పూర్ణచంద్రరావు ఇంటికి మంత్రి మేరుగ నాగార్జున వెళ్ళి పరామర్శ ఎందుకు చేయాల్సి వచ్చిందో లోగుట్టును వైసీపీ నాయకులు బట్టబయలు చేయాలని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్, విజయసాయిరెడ్డిలు చంద్రబాబు బంధువులపై మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌పై ఆరోపణలో ఆధారాలు ఉంటే మంత్రి మేరుగ నాగార్జున స్వయంగా సంధ్యా ఆక్వాసంస్థ యాజమాన్యాన్ని కలవటం వెనుక మర్మయేమిటని ఆయన ప్రశ్నించారు. బ్రెజిల్ నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకున్న సంస్థకు చెందిన కూనం పూర్ణచంద్రరావు, ఎంపీ విజయసాయిరెడ్డితో దిగిన ఫోటోలు వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు? బాబాయ్ కేసులోని హంతకులను ముఖ్యమంత్రి జగన్ కాపాడు తున్న మాట వాస్తవం కాదా అని కొల్లా అన్నారు.

ఓటు ప్రజల భవితను నిర్దేశిస్తుంది

● స్వీప్ నోడల్ అధికారి వై పిచ్చిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న స్వీప్ నోడల్ అధికారి పిచ్చి రెడ్డి

బాపట్ల, ఏప్రిల్ 1 : ఓటు ప్రజల భవిష్యత్తును నిర్దేశించే సాధనమని స్వీప్ నోడల్ అధికారి వై పిచ్చిరెడ్డి తెలిపారు. బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కాశాలలో సోమవారం ఓటర్ల చైతన్య సదస్సు నిర్వహించారు. అసోసియేట్ డీన్ ఎల్ ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్వీప్ నోడల్ అధికారి పిచ్చిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకుంటేనే మనం అస్తిత్వంలో ఉన్నట్లు నిరూపితమౌతుందన్నారు. ఓటింగ్‌శాతం పెరిగినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమర్థులైన వారిని ఎన్నుకొని సుపరిపాలన సాధించుకోవాలన్నారు. ఓటు ప్రగతికి బాటలు వేయాలన్నారు. సదస్సులో ఎన్నికల నిఘావేదిక కన్వీనర్ డాక్టర్ వీసీ సాయిబాబు, అధ్యాపకులు సీహెచ్ వీవీ సత్యనారాయణ, స్వీప్ సిబ్బంది శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు. తప్పనిసరిగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం : మోపిదేవి

రేపల్లె, ఏప్రిల్ 1 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నా రు. సోమవారం నిజాంపట్నం గ్రామంలో మొగదారమ్మతల్లి పూజలు నిర్వహించి వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ తరపున ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని గణేష్‌ను గెలిపించే దిశగా ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకు లు అడపా శేషు, గాదె మధుసూదన్‌రెడ్డి, మోపిదేవి రాజీవ్, ప్రసాదం వాసుదేవ, మోపిదేవి హరనాథబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం



విద్యుత్ తీగలు తగిలి దగ్ధమౌతున్న ట్రాక్టర్‌పై ఉన్న గడ్డి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 1: మండల పరిధిలోని జీఎస్‌పాలెం గ్రామానికి చెందిన పమిడి శివయ్యకు సంబంధించిన సుమారు ఎకరన్నర గడ్డివామి తన పొలం నుంచి ట్రాక్టర్‌పై ఇంటికి తరలిస్తుండగా ప్ర మాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మంటలు రావటంతో గడ్డి కాలి పోయింది. చుట్టు పక్కల వారు వచ్చి మంటలను అదుపు చేసే వీల్లేకుండా నష్టం జరిగినట్లు బాధితుడు శివయ్య తెలియజేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు 30వేలు నష్టం సంభవించిందని తెలిపారు

లబ్ధిదారులకు తక్షణమే పింఛన్ అందజేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

బాపట్లటౌన్, ఏప్రిల్ 1 : వృద్ధులు, వితంతువులు, అనారోగ్యానికి గురైన లబ్ధిదారులకు రాష్ట్రప్రభుత్వం తక్షణమే పింఛన్ అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీన అందజేసే పింఛన్‌ను సచివాలయ ఉద్యోగుల ద్వారా అందజేస్తామని లబ్ధిదారులకు కుంటిసాకులు చెబుతున్నారన్నారు. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి పింఛన్‌ను అం దజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి పింఛన్ తీసుకెళ్లేవిదంగా చర్యలు తీసుకోవాలని కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణమోహన్, శరత్‌లు పాల్గొన్నారు.

18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, డీఆర్వో

బాపట్ల, ఏప్రిల్ 1: సాధారణ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 18వ తేది నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సాధారణ ఎన్నికల నిర్వాహణ, సంసిద్ధతపై ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 18 నుంచి 25 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 26వ తేదిన నామినేషన్ పత్రాల పరిశీలన, 29వ తేది వరకు నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆతర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారన్నారు. మే 13వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, జూన్ 4వ తేదిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. 1510 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంప్‌లు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు 120శాతం ఈవీఎం యంత్రాలు సిద్ధంగా ఉంచామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని వాటి వద్ద వెబ్‌క్యాస్టింగ్, అబ్జర్వర్ల నిఘా ఉంచామన్నారు. సర్వీస్ ఓటర్లు, విధులలో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వినియోగించుకొనే అంశాలపై అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. రాజకీయపార్టీల నాయకులకు ఓటర్ల జాబితాలు అందజేస్తామన్నారు.

● నామినేషన్ వేయటానికి వచ్చే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పి.రంజిత్‌బాషా తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గానికి కలెక్టర్ ఆర్‌వోగా వ్యవహరిస్తారని తెలిపారు. 18వ తేది నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు అందుబాటులో ఉంచుతామన్నారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులకు మూడు వాహనాలకే అనుమతి ఉందన్నారు. ఆర్‌వో కార్యాలయానికి 100మీటర్ల వరకు మాత్రమే వాహనాలు అనుమతి ఉందన్నారు.

● ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయటానికి ప్రతి నియోజకవర్గానికి 9టీమ్‌లు చొప్పున 54టీమ్‌లు జిల్లాలో ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారుల టీమ్‌లు జిల్లాలో సమర్థంగా పనిచేయనున్నాయన్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద అద్దంకి, బాపట్ల, చీరా ల ప్రాంతాల్లో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. 21వేల రూపాయలు జరిమాన విధించామన్నారు. కోడ్ ఉల్లంఘించిన 9మంది వలంటీర్లు, నలుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, మరో ఇద్దరు ఎండీయూ వాహనాల నిర్వాహకులను తొలగించామని ఆయన స్పష్టం చేశారు.

● సీ-విజిల్ యాప్ కింద 213 ఫిర్యాదులు ఇప్పటివరకు అందాయని కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదు వచ్చిన 100 నిమిషాల్లోనే వాటిని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం కొనుగోలు, అమ్మకాలపై నిరంతర పరిశీలన చేస్తున్నామన్నారు. నగదు తరలించే అంశాలలో నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటున్నామని, పొరపాటున ధ్రువీకరణపత్రాలు లేకపోతే అలాంటివారి కోసం గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశామన్నారు.

అనుమతులు లేకుండా ప్రచారం చేస్తే చర్యలు : ఎస్పీ వకుల్

సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతారణంలో నిర్వహించటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. సరైన అనుమతులు లేకుండా ఎక్కడైన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలలోకి వచ్చిన తర్వాత బ్యాంక్ సెక్యూటిరి సిబ్బంది తప్ప ఎవరు ఆయుధాలు కలిగి ఉండరాదన్నారు. ఎవరైన ఆయుధాలు కలిగియున్న, ప్రదర్శించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 137లైసెన్స్ కలిగిన తుపాకులు ఉన్నాయని వాటిలో 86 స్వాధీనం చేసుకున్నామని మిగిలిన 51 బ్యాంకింగ్ సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న వారి వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో డిసెంబరుకు ముందు 508మందిపై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెండింగ్ వారెంట్‌లు లేకుండా చేశామన్నారు. 269 ప్రాంతాల్లో 337 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. జిల్లాలో 12 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయగా జిల్లా సరిహద్దుల్లో 9 అంతర్గతంగా 3 ఉన్నాయన్నారు. పాతనేరస్తులు, రౌడీలను సెక్షన్ 110 కింద 184 కేసుల్లో 488 మందిని, ఎన్నికల సమయంలో అల్లర్లు చేయటానికి అవకాశం ఉన్న వారిని 107 సెక్షన్ కింద 499 కేసుల్లో 7,557మందిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత 107 సీఆర్‌పీసీ కింద 36 కేసుల్లో 264 మంది, 110(ఇ) సీఆర్‌పీసీ కింద 19 కేసుల్లో 66 మందిని బైండోవర్ చేశామన్నారు. 154 కేసుల్లో రూ.8,68,890 విలువైన 10,126 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. మద్యంతోపాటు 14వాహనాలను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే రూ.91,15,630ల నగదు సీజ్ చేశామన్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇప్పటికే 400 శాతం అధికంగా మద్యాన్ని సీజ్ చేశామన్నారు. జిల్లాకు 2 బీఎస్ఎఫ్ ప్లాటూన్‌లు రాగా చీరాల, బాపట్లలో ఉంచామన్నారు. సమావేశంలో డీఆర్వో సీహెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన కాంగ్రెస్, వైసీపీ నాయకులు



వైసీపీ నాయకులు జిట్టా శ్రీనివాసరావు, కన్యాకుమారి దంపతులను పార్టీలో చేర్చుకున్న చంద్రబాబు



అప్పికట్ల సర్పంచ్ గుత్తికొండ రజనీ, రాజేష్ దంపతులకు పార్టీ కండువా కప్పిన చంద్రబాబునాయుడు

బాపట్ల, ఏప్రిల్ 1 : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో కాంగ్రెస్, వైసీపీ నాయకులు పెద్దఎత్తున టీడీపీలో చేరారు. ఆయా ప్రాంతాల నాయకులకు చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాగళం కార్యక్రమానికి విచ్చేసిన చంద్రబాబునాయుడు సమక్షంలో సోమవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్‌ల సారథ్యంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకులు, గత ఎన్నికలలో బాపట్ల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మొహిద్దీన్‌బేగ్‌కు కండువా కప్పిపార్టీలో చేర్చుకున్నారు. అదే విధంగా మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అనుచరులు, వైసీపీ నాయకులు అల్లం గోపికృష్ణతోపాటు జిట్టా శ్రీనివాసరావు, జిట్టా కన్యాకుమారి దంపతులు కూడా తెలుగుదేశంలో చేరారు. అప్పికట్ల గ్రామ వైసీపీ సర్పంచ్ గుత్తికొండ రజనీ, రాజేష్ దంపతులు, కర్లపాలెం మండలం గణపవరం మాజీ సర్పంచ్, వైసీపీనాయకులు కత్తి దానియేలు, చింతాయపాలెం మాజీ ఎంపీటీసీ మరకా శ్రీనివాసరావు, గుత్తికొండ కృష్ణమూర్తి, కోమట్ల వెంకటసుబ్బారెడ్డి, కె.రాజు, కొత్తా విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, ఊసా తులసీ తదితరులు తెలుగుదేశంపార్టీలో చేరగా నారా చంద్రబాబునాయుడు కండువాలు కప్పి ఆహ్వానించి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

ఖజానాలో డబ్బులు లేకే పింఛన్ పంపిణీ చేయలేదు

● ఉన్న డబ్బంతా జగన్‌రెడ్డి అనుకూల కాంట్రాక్టర్లకు పంచిపెట్టారు

● టీడీపీ పింఛన్‌లు అడ్డుకుందనడం వైసీపీ పరాకాష్టకు నిదర్శనం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు

రేపల్లె, ఏప్రిల్ 1: రాష్ట్రంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్ పంపిణీ చెయ్యకపోవటానికి నిధులు కొరతే కారణమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇంటి వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేయ్యాలని జగన్‌రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చెయ్యలేదని దానికి కారణం ఖజానాలో నిధులు లేకపోవడం కాదా అని ప్రశ్నించారు. సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధ ప్రాతిపదికన పింఛన్‌లు ఇంటి వద్దకే పంపిణీ సాధ్యమవుతుందని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కుటిల రాజకీయాలు చేస్తున్నారన్నారు. వలంటీర్లను సొంత కార్యకర్తలుగా ప్రకటించిన వైసీపీ నాయకులు ఎన్నికల సంఘం పరిధిలోకి తీసుకుని వారిని పక్కన పెట్టిందని ఆయన తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే రూ.4వేల పింఛన్‌ను అందిస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు మాట్లాడుతూ పింఛన్‌లు సకాలంలో ఇళ్ళ వద్దకే పంపిణీ చెయ్యకపోతే సీఎస్ జవహర్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి, జగన్‌రెడ్డిపై ఎన్నికల కమిషన్‌ను తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 1వ తేది పెన్షన్‌కు ఇవ్వాల్సిన డబ్బును జనవరి 23న బటన్ నొక్కిన ఆసరా డబ్బును ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన చేయూత డబ్బును ఫిబ్రవరి 29న పామర్రులో బటన్ నొక్కిన విద్యాదీవెన డబ్బును, మార్చి 14న ఈబీసీ నేస్తం బటన్ నొక్కిన డబ్బును ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన నిధులు రూ.13వేల కోట్లు మార్చి 16నుంచి 30వతేదీ లోపే 15రోజుల్లోనే జగన్‌రెడ్డి తనకు అనుకూల కాంట్రాక్టులకు దోచిపెట్టి దీంతో పింఛన్ సొమ్ము ఇవ్వటానికి నేడు ఖజానాలో సరిపడా నిధులు లేకే పింఛన్ ఇవ్వలేదన్నారు. తన దుర్మార్గాన్ని కప్పిపెట్టుకోవటానికి జగన్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌పైన నిమ్మగడ్డ రమేష్‌పైన టీడీపీపైన దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రజాసేవ కార్యక్రమాలకు కాకుండా జగన్‌రెడ్డి వారిని వైసీపీ కార్యక్రమాలకు వాడుకుంటూ దుర్వినియోగం చేశాడని వలంటీర్లు ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత విభాగం బీసీ కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, టీడీపీ నాయకులు వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, రేపల్లె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత భారతదేశమే లక్ష్యం

● సర్టిఫైడ్ మాస్టర్స్ రీసోర్స్ పర్సన్ ప్రభాకరరావు

నగరం, ఏప్రిల్ 1: బాల్య వివాహ రహిత భారతదేశాన్ని రూపొందించటమే లక్ష్యంగా కైలాశ్ సత్యాది చిల్డ్రన్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని సిఫార్ స్వచ్ఛంద సేవాసంస్థ బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ సర్టిఫైడ్ మాస్టర్స్ రీసోర్స్‌పర్సన్ అడుసుమల్లి ప్రభాకరావు అన్నారు. సోమవారం నగరం గ్రామంలో సిఫార్స్ స్వచ్ఛంద సేవాసంస్థ కా ర్యాలయంలో బాల్య వివాహాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030వ సంవత్సరం నాటికి భారతదేశాన్ని బాల్య వివాహరహిత దేశంగా రూపొందించేందుకు కైలాశ్ సత్యాది చిల్డ్రన్స్ ఫౌడేషన్ సహకారంతో దేశవ్యాప్తంగా ఏక్సస్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్తంగా 14రాష్ట్రాల్లోను రెండు కేం ద్రపాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం 261స్వచ్ఛంద సేవా సంస్థలతో బాలల సమస్యల నిర్మూలనకై కృషి చేస్తుందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాలలపై లైంగిక వేధింపు నిర్మూలన, బాల్య వివాహ రహిత సమాజ స్థాపన లక్ష్యాలుగా సంవత్సర కాలం నుంచి జిల్లాలో సిఫార్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మరిపాల నాగరాజు, బడుగు కిషోర్ కుమార్, బేతపూడి నాగేంద్రరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంత పాట రూ.5.60లక్షలు

నగరం, ఏప్రిల్ 1: మండలంలోని నగరం పంచాయతీ పరిధిలో వారాంతపు సంత పాటకు సోమవారం పంచాయతీ సిబ్బంది వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 2024నుంచి మార్చి 31 2025వరకు దీని కాలపరిమితి ఉంటుందని ఆయన తెలిపారు. వారాంతపు సంత పాటను గ్రామానికి చెందిన జన్ను నాగేశ్వరరావు రూ.5.60వేలకు పాడుకున్నట్లు ఆయన తెలిపారు. వీరి నుంచి ఆ నగదు స్వాధీనం చేసుకుని పంచాయతీ ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు.

ఈసీ ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తప్పవు

● ఎంపీడీవో శేషగిరిరావు

వేమూరు, ఏప్రిల్ 1 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లు వ్యవహరించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో శేషగిరిరావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు పింఛన్ల పంపిణీ విషయంలో జోక్యం చేసుకోరాదని ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం గాని ఈసీ ఆదేశాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయరాదన్నారు. అలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే స్థానికుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల పెన్షన్లు సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తామని పించను దారుడు ఆధార్ లేదా, ఇతర గుర్తింపు కార్డు చూపించాల్సి వస్తుందన్నారు. పింఛన్ పాస్ బుక్ చూపాల్సిన పని లేదన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నిరంతర సెలవుల దృష్ట్యా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని మూడో తేది నుంచి గ్రామాల్లో ప్రారంభిస్తారన్నారు. పింఛన్ లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించవలసిందిగా కోరారు.

తండ్రి విజయానికి తనయుడి ప్రచారం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 1 : బాపట్ల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కోన రఘుపతి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు కోన నిఖిల్ సోమవారం ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని మండేవారిపాలెం ఎస్టీకాలనీ, గౌడపాలెం గ్రామాల్లో స్థానిక, వైసీపీ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ రానున్న ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాస రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

ప్రజాగళం విజయవంతం

● కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్, తాతా జయప్రకాష్ నారాయణ

బాపట్ల, ఏప్రిల్ 1: బాపట్లలో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ విషయమై టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో అపూర్వ స్వాగతం పలుకుతూ ప్రజానీకం తరలిరావటంతో అన్నిరోడ్లు బ్లాక్ అయ్యాయన్నారు. సభ కొంత ఆలస్యం అయినప్పటికి అభిమానులు కార్యక్రమం ముగిసేవరకు ఉండటం సంతోషదాయకమన్నారు. ప్రతిఒక్కరు తనతోపాటు ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గెలిపించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా కలిసి రావటం సంతోషదాయకమన్నారు. చంద్రన్నను చూచేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు ఎంతో ఆసక్తి చూపారన్నారు. క్రైస్తవ సోదరులు పండుగరోజు కూడా ప్రార్థనలు చూచుకొని ఈ కార్యక్రమానికి రావటం సంతోషదాయకమన్నారు. ఇదేవిధంగా ప్రజలు ఆశీర్వదించి తమను గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

వెంకటరత్నం అంత్యక్రియల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రజాగళం కార్యక్రమానికి వచ్చి వెళుతున్న సమయంలో అప్పికట్లకి చెందిన టీడీపీ కార్యకర్త కుంచాల వెంకటరత్నం రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు సోమవారం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మలు పాల్గొని పుష్పాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేసి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, ఆచంట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనగాని గెలుపునకు కృషి చేయాలి

● టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు



పిరాట్లంక గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, ఏప్రిల్ 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని పిరాట్లంక గ్రామంలో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని 45రోజుల పాటు కష్టపడితే ఐదేళ్ళ పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో అనగాని నడిపిస్తారని అన్నారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో తీరప్రాంతంలోని ప్రధాన రహదారుల్లో తట్టెడు మట్టి కూడా వేసిన దాఖలాలు లేవన్నారు. మోకాలు లోతు గుంతల్లో రహదారులు అధ్వానంగా ఉంటూ నిత్యం ప్రమాదాలకు నిలయాలుగా మారాయన్నారు. ఇలాంటి వైసీపీ నాయకులకు ఓటు వేస్తే రానున్న రోజుల్లో ఇళ్లకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. తీరప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఒక్క అనగానితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్డి లక్ష్మీజీ, కమతం శివ, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, మండలి తారక బ్రాహ్మేణేశ్వరరావు, నీది వరప్రసాద్, ముత్తిరెడ్డి నివీన్, జనసేన నాయకులు కంచి పాములు, కంచి సుబ్బారావు, ముత్తిరెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం



మొసలిపాడులో ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కొల్లూరు, ఏప్రిల్ 1 : వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తరుపున టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. సోమవారం సాయంత్రం మండలపరిధిలోని మొసలిపాడు, తాడిగిరిపాడు గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, నాగళ్ల కృష్ణ, మాజీ సర్పంచ్ ప్రసాద్, గుమ్మడి రమేష్, రంజిత్, వెంకట్రావు, సాయి, కనపర్తి సంగీతరావు, సర్పంచ్ పోతార్లంక నాగేశ్వరరావు, తుమ్మల బాపయ్య చౌదరి, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, యలవర్తి కోటేశ్వరరావు, ఎన్నారై మణికంఠ, కొత్తపల్లి మధు, కాసరనేని మోహన్, సుంకర రాంప్రసాద్, జొన్నలగడ్డ దనుంజయ్, తలశిల పండబ్బాయి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వరహాపురం ఎస్టీ కాలనీలో...



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, ఏప్రిల్ 1: తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు విజయాన్ని కాంక్షిస్తూ బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు సోమవారం వరహాపురం ఎస్టీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేసి రాష్ట్రానికి రాష్ట్ర ప్రజలకు మంచి జరగేందుకు టీడీపీని గెలిపించాలని కోరారు. ఆనందబాబు గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హిజ్రాపై యువకుడి దాడి

కొల్లూరు, ఏప్రిల్ 1 : హిజ్రాపై యువకుడు పదునైన ఆయుధంతో దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. కొల్లూరులో చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన శ్రీలేఖ అనే హిజ్రాపై స్థానికంగా ఉన్న యువకుడు నడిబజారులో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో హిజ్రా అతన్ని చెంపపై కొట్టడంతో యువకుడు తన వద్ద నున్న పదునైన ఆయుధంతో హిజ్రాపై దాడి చేశాడు. దాడిలో హిజ్రాకు గాయాలయ్యాయి. స్థానిక ప్రాథమిక వైద్యశాలనందు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం తెనాలి వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై పోలీసులు తమకు ఫిర్యాదు అందలేదని, దాడి సంఘటన తమ దృష్టికి వచ్చిందని వైద్యశాల నుంచి వచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీపై వైచీప్ రాజకీయం

» రాజకీయ లబ్ధి కోసమే టీడీపీపై బురద » వలంటీర్లను రాబోయే ప్రభుత్వంలో కొనసాగిస్తాం » సచివాలయ సిబ్బందితో లబ్ధిదారులకు అందజేయాలి



ఏలూరి సాంబశివరావు



గొట్టిపాటి రవికుమార్

పర్చూరు, ఏప్రిల్ 1: పెన్షన్ల పంపిణీపై వైసీపీ దురుద్దేశపూర్వకంగానే రాజకీయం చేస్తుందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. నిధులన్నింటినీ జగన్ మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్లకు దోచిపెట్టారన్నారు. నేడు నిధుల కొరతతో ఖజానా ఖాళీ కావటంతో పెన్షన్ ఇవ్వలేక కొత్త రాజకీయానికి తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. సోమవారం పర్చూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఏలూరి మాట్లాడారు. పింఛన్ సొమ్ముతోపాటు, ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు మార్చి 16 నుంచి 30 తేదీల మధ్య ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టి పెన్షన్ దారులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. సచివాలయ సిబ్బంది, గ్రామకార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటివద్దే పెన్షన్లు పంపిణీ చేసేవిధంగా యుద్ధప్రాతిపతికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకటో తేదీన పెన్షనర్లకు ఇవ్వాల్సిన డబ్బును, జనవరి 23న బటన్ నొక్కిన ఆసరా డబ్బును, ఫిబ్రవరి 16న బటన్ నొక్కిన చేయూత డబ్బును, ఫిబ్రవరి 19న పామర్రులో బటన్ నొక్కిన విద్యా దీవెన డబ్బును, మార్చి 14న బటన్ నొక్కిన ఈబీసీ నేస్తం డబ్బును, ఆరోగ్యశ్రీకి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా రూ.13వేల కోట్లు మార్చి 16 నుంచి 30వ తేదీ లోపల తన అనుకూల కాంట్రాక్టర్‌లకు అప్పనంగా దోచిపెట్టారని విమర్శించారు. తన దుర్మార్గాన్ని కప్పిపెట్టుకోవటానికి వైసీపీ నేతలు టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. వలంటీర్లను ప్రజాసేవా కార్యక్రమాలకు కాకుండా వైసీపీ కార్యక్రమాలకు వినియోగించి వందల మంది వలంటీర్లు క్రిమినల్ కేసుల బారిన పడటానికి జగన్‌మోహన్‌రెడ్డి కారకులయ్యారన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవటానికి కారణం నిధులు కొరతే గాని ఎన్నికల కమిషన్ కాదన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని మార్చి 28న అధికార పార్టీ దినపత్రికలో వైసీపీ ప్రభుత్వం చెప్పిన వార్తను ప్రచురితం కావడం ఆపార్టీ నేతలకు కనిపించలేదా? అని ఏలూరి ప్రశ్నించారు. వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రజాసేవ మాత్రమే చేసే వలంటీర్లను రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి పింఛన్లను సచివాలయం సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పంపిణీ చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తుందని ఏలూరి పేర్కొన్నారు.

ఖజానా ఖాళీ చేసి నగదులేక టీడీపీపై అసత్య ప్రచారం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1: పింఛన్ల పంపిణీపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. జగన్‌రెడ్డికి చేతగాక టీడీపీపై అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదలచేశారు.

సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతేగాని ఎన్నికల కమిషన్, తెలుగుదేశం పార్టీ కాదన్నారు. ఖజానాలో నిధులులేకనే జగన్‌రెడ్డి ఒకటో తేదీ పింఛన్ల పంపిణీకి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. 1.3 లక్షల సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ సాధ్యమేనని చెప్పారు. సీఎం జగన్ స్వార్థ రాజకీయం వలనే పింఛన్ దారులు నష్టపోతున్నారన్నారు. పింఛన్లు ఆపమని ఎలక్షన్ కమిషన్ ఎక్కడా చెప్పలేదన్నారు. ఒకటో తేదీ పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించిందన్నారు. పింఛన్లు పంపిణి చేయాల్సిన నగదును జగన్‌రెడ్డి తన అనుకూల కాంట్రాక్టర్లకు ఊడ్చి పెట్టారన్నారు. దీంతో ఖజానాలో డబ్బులు లేక వైసీపీ ప్రభుత్వం కొత్తనాటకానికి తెర లేపిందని ఎమ్మెల్యే రవి కుమార్ ధ్వజమెత్తారు.

పింఛన్ల పంపిణీకి మేము వ్యతిరేకం కాదన్నారు. పింఛన్లను పెంచింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. జగన్‌రెడ్డిలా దశలవారీగా పింఛన్ల పెంపు చేయలేదని పేర్కొన్నారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే రూ.4 వేల పింఛన్‌ను ఎటు వంటి ఆంక్షలు లేకుండా ఇస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల చేత ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇవ్వాలని ఎమ్మెల్యే రవికుమార్ డిమాండ్ చేశారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల



విద్యుత్ దీపాలంకరణలో వీరాంజనేయస్వామి

మార్టూరు, ఏప్రిల్ 1: మండలంలోని వలపర్ల గ్రామంలో సాగర్ కాలువ పక్క ఉన్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఏటా ఈదేవాలయంలో వానరం పేరుతో తిరునాళ్లను జరపడం ఆనవాయితీగా వస్తుంది. అందులోభాగంగా దేవాలయ కమిటీ సభ్యులు ఈఏడాది కూడా తిరునాళ్ల నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను అందంగా అలంకరించారు. ఆలయానికి సమీపంలో విద్యుత్ దీపాలంకరణతో ఏర్పాటుచేసిన వీరాంజనేయస్వామి బొమ్మ భక్తులను ఆకట్టుకుంది. ఎన్నికల కోడ్ ఉండటంతో విద్యుత్ ప్రభలు, తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేయలేదు. రాత్రి స్వామి వారి జెండాను దేవాలయం నుంచి ఊరేగింపుగా గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కోలాటం ప్రదర్శించారు. రాత్రి తిరునాళ్లలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్‌హెచ్‌ఓ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఏఎస్ఐలు సైదా, మహబూబ్ బాషా, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, బల్లికురవ స్టేషన్‌కు చెందిన సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌పై కోర్టుకెళతాం!



అప్రూవల్ ఆర్డర్‌ను చూపుతున్న పాలేటి

చీరాల, ఏప్రిల్ 1 : వేటపాలెం మండలం కొత్తపేట పరిధిలో పార్కు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులకు కలెక్టర్ ఇచ్చిన అప్రూవల్ ఆర్డర్‌పై తాము కోర్టుకు వెళతామని టీడీపీ నేత, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు చెప్పారు. స్థానిక డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణను పాలేటి తన సహచరులతో సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కుందేరు స్థలంలో జరిగిన పార్కు నిర్మాణాన్ని వెంటనే పగుల గొట్టాలని డిమాండ్ చేశారు. పార్కు నిర్మాణంతో కుందేరు నీటి ప్రవాహం సక్రమంగా జరగదని చెప్పారు. భవిష్యత్‌లో జనావాసాలు పెరిగి పారుదలలేక ముంపు సమస్య వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందుకు చెన్నై, ముంబయి, హైదరాబాద్‌లలో పరిస్థితులను వివరించారు. ఈనేపథ్యంలో పాలేటి, ఈఈ మురళీకృష్ణ మధ్య ఒకింత వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో పంచారాజ్‌శాఖకు కలెక్టర్ అప్రూవల్ ఆర్డర్ ఇచ్చారని, ఆ నిర్మాణాన్ని పగులగొట్టే అధికారం తనకు లేదని ఈఈ చెప్పారు. దీంతో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌పై కోర్టుకు వెళతామని పాలేటి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కటకం శ్రీనివాసరావు, నాగేశ్వరరెడ్డి, గుమ్మడి ఏసురత్నం, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 1: వేటపాలెం మండలం కొత్తపేట పంచా యతీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాయిపాలెంకు చెందిన బుచ్చమ్మ(55) మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని అక్కయిపాలెంకు చెందిన పలువురు మహిళలు వేరుశనక్కాయల మిషన్ ట్రాక్టర్‌పై అక్కాయిపాలెం నుంచి పాపాయిపాలెంకు వెళుతున్నారు. ట్రాక్టర్‌కు ఇరువైపులా అమర్చిన రేకులపై వారు కూర్చున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్ మన్నం అపార్ట్‌మెంట్ సమీపంలో ఒకవైపు రేకు విరిగి దానిపై కూర్చున్నవారు కింద పడిపోయా రు. స్థానికులు అందించిన సమాచారం మేరకు క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. వారిలో బుచ్చమ్మ(55) మృతి చెందింది. మిగిలిన వారిలో బుర్ల శారద, మరో ఇద్దరు మహిళలకు బలమైన గాయాలయ్యాయి. వీరితో పాటు మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కూటమి అభ్యర్థి కొండయ్య ఏరియా వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటా మని భరోసా కల్పించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు చెప్పారు.

అలాగే, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌లు ఏరియా వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాల అండగా ఉంటా మని భరోసా కల్పించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అం దించాలని చెప్పారు.

పర్చూరులో కూటమి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

పర్చూరు, ఏప్రిల్ 1: టీడీపీ జనసేన సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రచార కార్యక్రమం హోరందుకుంది. పెద్ద ఎత్తున యువకులు, మహిళలు పాల్గొని మద్దతుగా నిలుస్తున్నారు. సోమవారం పర్చూరులోని పలుప్రధాన కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకట కృష్ణారావు, నాయకులు కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తంగెళ్ళ మల్లికార్జునరావు, కొండ్రగుంటి సుబ్బారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, పఠాన్ మీరావలి, శ్రీరాం వెంకటసుబ్బారావు, ఉప్పుటూరి నరేంద్ర, కోటగిరి ప్రసాద్, బేత కిషోర్, ఊటుకూరి నిర్మల, శివాలశెట్టి రమాదేవి, కొల్లా సుబ్బాయమ్మ, కొల్లా చౌదరి, జనసేన ప్రతినిధులు కారంపూడి సందీప్‌తేజ, బాలు, తోట మణి, కందా సరేంద్రబాబు, కొనసా యశ్వంత్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కవాతు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అద్దంకి పట్టణ సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుపాడు, కోటికలపూడి గ్రామాల్లో సీఐ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ బలగాలు, అద్దంకి పోలీస్‌సిబ్బందితో కవాతు నిర్వహించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

» టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



టీడీపీ సూపర్ సిక్స్ పథకాల వివరాలను అందజేస్తున్న రవికుమార్

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం అద్దంకి మున్సిపాలిటీలోని 20వ వార్డులో ఇంటింటికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్, మ్యానిఫెస్టోలోని పథకాలను తెలియజేసే కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ ప్రచారం నిర్వంహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆడబిడ్డలను మహాశక్తిగా రూపొందించేందుకు తెలుగుదేశం పార్టీ మహాశక్తి ప్రథకం ద్వారా అనేక పథకాలను మహిళలకోసం రూపొందించిందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్టు చెప్పారు. 18 నుంచి 59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500లతో పాటు ఇంటిలో ఎంత మంది చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తామన్నారు. యువతకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల భర్తీ, రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే, బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, కుళాయి ద్వారా ప్రతి ఇంటింకి మంచినీరు, పూర్ టూ రిచ్ పేరుతో పేదలను ధనికులను చేసే పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు.

అద్దంకి పట్టణంలోని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పన, నూతన గృహాలు, డ్రైనేజి, కాలువల నిర్మాణం వంటివి కల్పించడంతోపాటు తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ప్రజలందరూ నష్టపోయారన్నారు. అధికారంలోకి రాగానే ప్రజా వేదికను కూల్చారని అన్నారు. రాజధానికి రైతులు ఇచ్చిన 50 వేల ఎకరాల్లో రూ.10 వేల కోట్లతో అప్పటి టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి నాశనం చేసిందన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసివేసిందన్నారు. చెత్త మీదకుడా పన్ను వేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌రెడ్డిదేనని చెప్పారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం ఏమైందని రవికుమార్ ప్రశ్నించారు. ఐదేళ్లలో కరెంటు చార్జిలు 9 సార్లు పెంచారని, మద్యంపై పెద్ద ఎత్తున్న దోపిడీ చేస్తున్నారన్నారని ధ్వజమెత్తారు.

అద్దంకి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన శాశ్వత మంచినీటి పథకానికి తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.84 కోట్లు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేయకుండా బాధ్యతారాహిత్యం వ్యవహరించిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లను పేదలకు అందించడంతో పాటు, మంచినీటి పథకాన్ని పూర్తిచేసి పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కోనేటి అనీల్, కోనేటి శ్రీనివాసరావు, తదితరులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. నగదుతో పరారీ

» పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

» బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్

పర్చూరు, ఏప్రిల్ 1: ఓ యువకుడిపై దాడి చేసి నగదుతో పరారైన సంఘటన సోమవారం పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పర్చూరుకు చెందిన ఆకుల మధుబాబును ఆదివారం రాత్రి పర్చూరు - చిలకలూరిపేట ఆర్‌అండ్‌బీ రహదారిలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. అతని వద్దఉన్న రూ.40 వేల నగదుతోపాటు, సెల్‌ఫోన్‌తో పరారయ్యారు. దుండగుల దాడిలో గాయపడిన క్షతగాత్రుడు స్నేహితుల సహకారంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పర్చూరు సీఐ సీతారామయ్య, ఎస్సై రమేష్ తన సిబ్బందితో హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. విచారణ అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడిపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పందించారు. సోమవారం పర్చూరులోని బాధితుడు ఆకుల మధుబాబు నివాసానికి వెళ్లి పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించినవారిలో ఏలూరితోపాటు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

» కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య

» ఊపందుకున్న ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 1: అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. మండల పరిధిలోని ఈపురుపాలెంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలసి సూపర్ సిక్స్, బీసీ డిక్లరేషన్‌తో ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నేతన్నల సమస్యల పరిష్కారం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. అందుకనుగుణంగా స్థానికంగా ఓటు రూపేణా తనను ఆశీర్వదించాలని కోరారు.

అంతకుముందు పార్టీ కార్యాలయంలో చేనేత కార్మిక మిత్రమండలి ప్రతినిధి గుద్దంటి సుబ్బారావు, వేటపాలెం మండలం రామనగర్‌కు చెందిన మధుసూదనరావు, గోపాల్, శ్యామ్ మురళి, పిట్టువారిపాలెంకు చెందిన యేసయ్య తదితరులు కొండయ్యను కలసి తమ మద్దతు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

» ఎమ్మెల్యే గొట్టిపాటి తనయుడు హర్షవర్ధన్



టీడీపీ పథకాల కరపత్రాలను అందజేస్తున్న హర్షవర్ధన్

సంతమాగులూరు(అద్దంకి టౌన్), ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగాలు లేక వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. సోమవారం సంతమాగులూరు మండలం పత్తేపురం గ్రామంలో రవికుమార్‌కు మద్దతుగా ఆయన తనయుడు హర్షవర్ధన్ ఇంటింటికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రవికుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాని కోరారు. వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను వచ్చించిందని అన్నారు. అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ నమ్మబలికిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినతర్వాత నిరుద్యోగులను నిలువున మోసం చేశారన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ లేక, రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుండి సహకారం లేక యువత భవిషత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసౌకర్యానికి తావులేకుండా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

పర్చూరు, ఏప్రిల్ 1: ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలనికి తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని పర్చూరు మండల ఏఆర్వో, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక క్రీడా వికాస కేంద్రంలో బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పర్చూరు మండల పరిధిలో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పిం చాలన్నారు. సమావేశంలో బూత్ లెవెల్ అధికారులు, ఎలక్షన్ డీటీ సూ ర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంకొల్లు శివాలయం బజారులో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వృథాగా పోతున్న నీరు

ఇంకొల్లు, ఏప్రిల్ 1: ఇంకొల్లు పంచాయతీలో తాగునీరు వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోవడంలేదు. నిత్యం రద్దీగా ఉండే ఇంకొల్లు శివాలయం బజారులో గంగవరం రోడ్డుకు సమీపంలో రక్షిత నీరు సరఫరా జరిగే పైపులైను వారం రోజులు క్రితం పగిలిపోయి నీరు వృథాగా పోతూ కాలువను తలపిస్తోంది. వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వెంటనే పంచాయతీ అధికారుల స్పందించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అమ్మ ఆశ్రమ భవన నిర్మాణానికి విరాళం

మార్టూరు, ఏప్రిల్ 1: మార్టూరులోని కొణిదెన రోడ్డులో నిర్మాణం జరుగుతున్న అ మ్మ ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి హైదరాబాదులోని వెస్సో సంస్థ రూ.51,116 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమవారం హైదరాబాదులోని కోటి సెంటరులోగల బీసీ భవనంలో ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు సంబంధిత చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వెస్సో సంస్థ అధ్యక్షుడు బంగారు తాతారావు, కార్యదర్శి బంగారు శ్రీనివాస్, గురజాపు వరప్రసాద్, డాక్టర్ దాకోజు కశ్యప్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మగుండం వద్ద ప్రత్యేక పూజలు



కొణిదెన బ్రహ్మగుండం వద్ద ప్రత్యేక హోమాలలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ, ఏప్రిల్ 1: మండలంలోని కొణిదెన గ్రామంలో ఉన్న ప్రసిద్ధ బ్రహ్మగుండం వద్ద సోమవారం నవగ్రహ పూజ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. 41 రోజుల క్రితం బ్రహ్మగుండం వద్ద గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదిత్యాది నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా 41 రోజుల పండుగ వేడుకలు నిర్వహించారు. నవగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

రేణుకమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పంగులూరు, ఏప్రిల్ 1: పంగులూరులో నూతనంగా నిర్మించనున్న రాయిణి వంశదేవర రేణుకమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా వేద పండితులు వేముల శ్రీహరి, త్రినాథ్‌లు శాస్త్రోక్తంగా పూజలు, హోమం నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని క్రతువు నిర్వహించారు. కార్యక్రమంలో పంగులూరు, చందలూరు, దుద్దుకూరు, చీరాల పరిసర ప్రాంతాలకు చెందిన రాయిణి వంశస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మృతి చెందిన శ్రీకాంత్

అద్దంకి టౌన్, ఏప్రిల్ 1: గోతుల రోడ్డు ఓ యువకుడి ప్రాణాన్ని బలితీసుకుంది. అద్దంకి మండలంలోని కుంకుపాడుకు చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్(29) గత నెల 19వ తేదీ రాత్రి మోటర్ సైకిల్‌పై తాళ్ళూరు వైపు వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డు పై గోతులను గుర్తించకపోవడంతో మోటర్ సైకిల్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలైన శ్రీకాంత్‌ను ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి తరువాత రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

ఎండ వేడిమికి కార్మికుడు మృతి

మార్టూరు, ఏప్రిల్ 1: ఎండ వేడిమికి కొమ్మూరి వెంకటేశ్వర్లు(55) అనే కార్మికుడు సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు మార్టూరులోని పడమర బజారున నివసిస్తున్నాడు. కుటుంబసభ్యుల కథనంమేరకు .. నాగరాజుపల్లి రోడ్డులోని ఓ పొగాకు కంపెనీలో ఆయన పనిచేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో వ్యక్తిగత పని నిమిత్తం మార్టూరు సెంటరులో తిరుగుతూ ఉండగా ఎండ వేడిమికి తట్టుకోలేక ఒక షాపు ముందు సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు అతని ముఖంపై నీటిని చల్లినప్పటికీ తేరుకోక సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అతని భార్య గతంలోనే చనిపోగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు.

యువకులపై కేసు నమోదు

పర్చూరు, ఏప్రిల్ 1: వాట్సప్ మెసేజ్ పురస్కరించుకుని జరిగిన దాడికి సంబంధించి ఐదుగురు యువకులపై పర్చూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం హత్యాయత్నంతోపాటు, ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుని బంధువుకు వీరన్నపాలెం గ్రామానికి చెందిన భాను అనే యువకుడు పంపిన వాట్సప్ మెసేజ్‌తో వివాదం చోటుచేసుకుంది. ఇది కాస్త ఘర్షణగా దారితీసింది. చాకుతో దాడిచేసి కులంపేరుతో దూషించారన్న ఫిర్యాదుతో గౌస్‌తోపాటు, మరో నలుగురు యువకులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ప్రజాగళం విజయవంతం

బాపట్ల, ఏప్రిల్ 1 : బాపట్లలో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. ఈవిషయమై టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో అపూర్వస్వాగతం పలుకుతూ ప్రజానీకం తరలిరావటంతో అన్నిరోడ్లు బ్లాక్ అయ్యాయన్నారు. సభ కొంత ఆలస్యమైనప్పటికి అభిమానులు కార్యక్రమం ముగిసేవరకు ఉండటం సంతోషదాయకమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఐక్యంగా కలిసి రావటం సంతోషదాయకమన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

గంజాయి కేసులో 20ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్1: గంజాయి రవాణా కేసులో నిందితులకు 20 సంవత్సరాల జైలుశిక్ష, లక్షరూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా చోడవరం గ్రామానికి చెందిన బొబ్బిలి సాయి, విశాఖపట్నం రూరల్ జిల్లా నర్సీపట్నం గ్రామానికి చెందిన టి.వెంకట సత్యనారాయణ, బాపట్ల జిల్లా అద్దంకి గ్రామానికి చెందిన గుంజి నాగరాజు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. 2021లో ఖమ్మం రూరల్ పోలీసులు కోదాడ క్రాస్‌రోడ్‌లో తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను తనఖీ చేశారు. వారి నుంచి 170 కేజీల 190గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కేసు నమోదుచేసి ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువుకావటంతో పైవిధంగా తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు వాదించగా, కోర్టు కానిస్టేబుల్ కె.తిరుమలరావు, లైజన్ ఆఫీసర్ భద్రునాయక్, శ్రీనివాసరావు, హోంగార్డు యం.డి.ఆయ్యూబ్ సహకరించారు.